ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 28 డిసెంబరు 2024 | 5







ఓ..టర్న్ చేసింది!

రాష్ట్ర గతి మార్చిన.. తూర్పుగోదావరి

ఏడాదికి 365 రోజులు.. నెలలు గడిచాయి.. వారాలు గడిచాయి.. ఇక రోజులే ఉన్నాయి.. అది కూడా 2024లో మిగిలింది మూడు రోజులే.. అంటే 72 గంటల్లో కొత్త ఏడాదిలో అడుగు పెట్టబోతున్నాం.. మరి 2024 ఏం చేసిందో తెలిస్తే.. ఒళ్లు గగుర్పొడుస్తోంది.. ఎందుకంటే చరిత్రకు సాక్ష్యం నిలిచింది.. ఎన్నో సమాధానంలేని ప్రశ్నలకు సమాధానమైంది.. ?

ఓటు ఏం చేయగలదు.. పచ్చనోటుకు అమ్ముడుపోతోంది.. అదేం చెబితే అదే చేస్తుంది.. పథకాలకు అమ్ముడుపోతోంది.. ఎవరు ఎక్కువ ఇస్తే వారి వైపు ఉంటుంది.. ఇది గత ఎన్నికల ముందు వరకూ ఉన్న అపోహ.. అయితే 2024 మాత్రం ఓటు ఏం చేయగలదో నిరూపించింది.. మరో 30 ఏళ్లు నేనే సీఎం అన్న జగన్‌ను ఎక్కడ కూర్చోపెట్టాలో అక్కడే కూర్చోబెట్టింది.. మాకేంటి అని ఐదేళ్లు విర్రవీగిన నాయకులదీ అదే పరిస్థితి.. ఓటు బలమేంటో చాటిచెప్పింది.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఐదేళ్ల వైసీపీ అరాచకానికి నిలువునా ఓటుతో పాతరేశారు.. జిల్లా రాజకీయ చరిత్రలో మును పెన్నడూ లేని విధంగా కూటమికి మొత్తం 21కి 21 సీట్లు కట్టబెట్టారు. ఒకరకంగా చెప్పాలంటే 2024 ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసింది. రాజకీయ స్థితిగతులను మలుపుతిప్పింది. తూర్పు గోదావరి జిల్లాలో 2024 సరికొత్త రాజకీయ ఉదయానికి నాందిపలికింది. పవన్ గాలిలో.. చంద్రుడి వెలుగులో ఫ్యాన్ తునాతునకలైంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

2024.. మరో నాలుగు రోజుల్లో కాలగర్భంలో కలిసిపోబోతోంది.. మరో కొత్త సంఖ్య కాలగమనంలోకి అడుగుపెట్టబోతోంది.. కానీ గతించిపోతున్న 2024 ఏడాది మాత్రం చరిత్రను తిరగరాసింది. ఓటు విలువ చాటి చెప్పింది.మునుపెన్నడూ లేని విధంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పెను సంచలనాలకు కేంద్రబిందువుగా మారింది. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేయడంలో కనివినీ ఎరుగని రీతిలో కీలకపాత్ర పోషించింది. రాష్ట్రంలో ఐదేళ్ల అరాచకానికి నిలువెత్తు పాతరవేసింది. తనదైన తీర్పుతో చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

ఓటు ఊచకోత..

2024 ఏడాది అంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగానే రాష్ట్ర రాజకీయాలు సాగాయి. ఈ సంవత్సరం ఐదేళ్ల వైసీపీ అరాచక ప్రభుత్వానికి పాతరేసేలా అటు ఓటర్లు, ఇటు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగాయి. ప్రత్యర్థి పార్టీలే కాకుండా ఓట్లేసి గద్దెనెక్కించిన ప్రజలను సైతం వైసీపీ తన అహంకార,అరాచక పాలనతో వేధించడంతో ఓటర్లంతా కసిగా నిశ్శబ్ద యుద్ధం సాగించారు. అటు కూటమి పార్టీలు సైతం విభేదాలకు తావులేకుండా కలిసికట్టుగా ముందుకు సాగి చరిత్ర ఎరుగని భారీ విజయం సాధించాయి. వాస్తవానికి 2024, మేలో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది జనవరి నుంచే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకరేపాయి. ఈ ఏడాది జనవరి 26న పవన్ పొత్తులో భాగంగా తొలి జాబితా ప్రకటించారు. రాజానగరం, రాజోలు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని రాష్ట్రంలోనే తొలి రెండు సీట్లను ప్రకటించి వైసీపీపై రాజకీయ యుద్ధానికి నాంది పలికారు. అదేనెలలో టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించారు. ఉమ్మడి జిల్లాలో తునిలో ఏ పార్టీ విజయం సాధిస్తే ఆపార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్‌కు కొనసాగింపు అన్నట్టు జనవరి 10న తుని నుంచి రా..కదలి రా..సభతో చంద్రబాబు తన ఎన్నికల శంఖారావం పూరించారు. జనవరి 23నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి సుడిగాలి పర్యటనలతో ప్రచార స్పీడు పెంచారు. మరోపక్క జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచే పోటీ చేస్తున్నట్టు మార్చి 14న ప్రకటించారు. అప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి జిల్లాపైనే పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లలో ఒక్కస్థానం కూడా వైసీపీకి రాకుండా చేసే బాధ్యత తనదని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. మార్చి 16న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ కాక పెరిగిపోయింది. కూటమిలో ఏప్రిల్ రెండో వారం నాటికి అభ్యర్థుల లెక్క తేల్చేసి ఎన్నికల బరిలోకి దిగాయి. ఒకపక్క టీడీపీ అధినేత చంద్రబాబు.. మరో పక్క జనసేన అధినేత పవన్.. ఇంకోపక్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి సునామీ స్పీడుతో ఎన్నికల రణక్షేత్రంలో కదిలి జనచైతన్యాన్ని పెంచాయి.

ఫ్యాన్ రెక్కలు ముక్కలు..

ఐదేళ్ల అరాచకంతో విర్రవీగిన వైసీపీ ఈ ఏడాది జనవరి నుంచే జిల్లాలో చేదు జ్ఞాపకాలను మూటగట్టుకుంది. కాకినాడలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి నుంచి ఈ చివర తునిలో మంత్రి దాడిశెట్టి రాజా, రాజమహేంద్రవరంలో మంత్రి వేణు.. ఇలా ఒకరేంటి ఎవరికివారే ఐదేళ్లు అధికారం మత్తులో జిల్లాను జుర్రేశారు. వీరందరికి తోడు ఎంపీ మిథున్‌రెడ్డి కడప నుంచి వచ్చి జిల్లాపై సాగించిన పెత్తనం, అక్రమాలు,దందాలు, స్కామ్‌లు జిల్లా ప్రజల్లో వైసీపీపై అసహ్యం పుట్టించేలా చేశాయి.అప్పటికే పన్నుల మోత, ఛార్జీల వాత,రీసర్వే పేరుతో భూముల్లో మతలబులు, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులను లూటీచేసే ప్రయత్నాలతో ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత పెంచేసింది.దీంతో కాకినాడలో జనవరి 3న జగన్ పర్యటించిన సమయంలోను ప్రజలెవరూ రాకుండా ఆ పార్టీ ఓటమిని ముందే ఖాయం చేసేశారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత పేరుతో వారిని మార్చి కొత్తవారిని నిలబెట్టినా జనం ఆదరించలేదు. చివరకు పిఠాపురంలో పవన్‌ను ఓడించేందుకు అప్పటికప్పుడు ముద్రగడను పార్టీలోకి చేర్చుకోవడం, కడప నుంచి మిథున్‌రెడ్డి మనుషులను,వందలకోట్ల డబ్బును పంచినా ప్రజల ఛీత్కారం నుంచి వైసీపీ తప్పించుకోలేక పోయింది. చివరకు ముద్ర గడను సొంతకూతురే ఛీల్చిచెండాడడంతో వైసీపీ మరింత పలుచన అయిపోయింది. చివరకు ఎన్నికల ఫలితాలతో ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలయ్యాయి.అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీకి క్యాడర్ కూడా ముఖం చాటేయడంతో 2024 ఆపార్టీకి పీడకలగా మారినట్లయింది.

ముద్రగడ పద్మనాభరెడ్డిగా.. ముద్రగడ పద్మనాభం

- 2024 ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు జరిగాయి.. ఈ ఎన్నికల్లో ప్రధాన ఆకర్షణ ముద్రగడ పద్మనాభం. ఎన్నికల్లో వైసీపీ గెలవకపోతే పేరు మార్చుకుంటానని శపథం చేశారు. ఈ ఎన్నికలో ఘోరంగా ఓటమి పాలవడంతో ఆయన తన పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకున్నారు.
- పి.గన్నవరంలో కూటమి అభ్యర్థిగా టీడీపీనుంచి మహాసేన రాజేష్‌ను ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆయన స్వచ్ఛందంగా టిక్కెట్ వదులుకున్నారు. పోలీస్ విభాగంలో పనిచేసిన గిడ్డి సత్యనారాయణ జనసేన తరపున అనూహ్యంగా ఆ టిక్కెట్ అందుకుని విజయం సాధించారు.
- ఎన్నికల ముందు వరకూ జనసేనలో ఉన్న పితాని బాలకృష్ణ, శెట్టిబత్తుల రాజబాబు, డీఎంఆర్ శేఖర్, టీడీపీలో ఉన్న గొల్లపల్లి సూర్యారావు ఎన్నికల ముందు వైసీపీలో చేరారు.
- మునిసిపల్ కౌన్సిలర్ కుమారుడైన సుభాష్ అనూహ్యంగా రామచంద్రపురం టిక్కెట్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి అయ్యారు.
- వైసీపీ ప్రభుత్వంలో రామచంద్రపురం, కొవ్వూరు నుంచి మంత్రులుగా కొనసాగిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత వారు పనిచేసిన నియోజకవర్గాల్లో కాకుండా రాజమహేంద్రవరం, గోపాలపురం నియోజకవర్గాల్లో పోటీచేసి ఓటమి పాలయ్యారు.

- మార్పు తెచ్చిన 'తూర్పు'తీర్పు
- 2024లో రాజకీయ సంచలనం
- కూటమికి మద్దతుగా ఓటర్లు
- అన్ని స్థానాల్లో క్లీన్‌స్వీప్
- 21 స్థానాల్లోను అఖండ విజయం
- వైసీపీకి వాతపెట్టిన జనం
- పిఠాపురం నుంచి బరిలో పవన్
- రాజమండ్రి నుంచి పురందేశ్వరి
- రాష్ట్రవ్యాప్తంగా మార్మోగిన జిల్లా
- చంద్రబాబు.. మోదీ ప్రచారం
- ఓటు సంవత్సరంగా 2024



అరాచకాన్ని అదిమిపట్టి.. ఓటుతో తొక్కేశారు!

మే 14న అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా అప్పటికే కూటమికి అధికారం కట్టబెట్టడానికి సిద్ధపడ్డ ఓటర్లు కనివినీ ఎరుగని రీతిలో పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు.పోలింగ్ సమయం ముగిసినా సరే కదలకుండా అర్థరాత్రి పన్నెండు దాటినా ఓట్లు వేసి తీరాలనే కసితో బారులు తీరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఓటర్ల పట్టుదల రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. జూన్ 4న వెల్లడైన ఫలితాల్లో ఓటర్ల సునామీ తీర్పును కళ్లకు కట్టాయి. ఈ ఫలితాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 అసెంబ్లీ స్థానాలతో పాటు రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని రెండు సీట్లు కలిపి మొత్తం 21 స్థానాల్లో కూటమి పార్టీ విజయం సాధించింది. అసలు ఒక్కటంటే ఒక్క సీటు కూడా అధికార వైసీపీ గెలవలేదు.ఐదేళ్ల పాటు అధికారాన్ని అడ్డంపెట్టుకుని విర్రవీగి ఉమ్మడి జిల్లాను అన్ని విధాలా లూటీచేసిన వైసీపీ నేతలను ప్రజలు ఈడ్చికొట్టారు. చెంప చెళ్లమనే తీర్పునిచ్చి పాతాళానికి తొక్కేశారు.కూటమిలో ఒక్కో ఎమ్మెల్యేకు రికార్డుస్థాయి మెజార్టీ కట్టబెట్టారు.

పదవులు వరించెన్

ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరిని అనూహ్యంగా ఉన్నత పదవులు వరించాయి.కొత్తవారికి మంత్రి పదవులు దక్కగా ఆయా పార్టీలకు విధేయులుగా ఉంటూ కూటమి గెలుపునకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పోస్టులు లభించాయి. ఉమ్మడి జిల్లా నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు. పలు కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరిస్తున్నారు. నిడదవోలు నుంచి జనసేన తరపున ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేశ్ పర్యాటక శాఖ మంత్రి అయ్యారు. రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వాసంశెట్టి సుభాష్ సామాజిక సమీకరణల్లో భాగంగా అనూహ్యంగా మంత్రి పదవి దక్కించుకున్నారు. టీటీడీ బోర్డు మెంబర్లుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన పారిశ్రామికవేత్త అక్కిన మునికోటేశ్వరరావు ఎంపికయ్యారు. కౌడా ఛైర్మన్‌గా పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మలబాబు, రుడా ఛైర్మన్‌గా బీవీఆర్ చౌదరి, ఆడా ఛైర్మన్‌గా ఎ.స్వామి నాయుడు, సివిల్ సప్లైస్ ఛైర్మన్‌గా జనసేన కాకినాడ నగర అధ్యక్షుడు తోట సుధీర్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు ఇంకా చాలామంది నాయకులు ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా ఎంపిక య్యారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబులను ప్రభుత్వ విప్‌లుగా నియమించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావును శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా, సీఎం ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్‌గాఉన్న టీడీపీ సీనియర్ నేత పెందుర్తి వెంకటేశ్‌కు కేబినెట్ హోదా కల్పించారు. ఇలా జిల్లాకు చెందిన పలువుర్ని పదవులు వరించాయి.





ఆత్రేయపురం మండలం పరిధిలోని కాటన్ బ్యారేజీపై గ్రావెల్ లారీలు, ట్రాక్టర్ల పరుగులు

ఇవేం వసూళ్లు

- మైనింగ్ సెస్ పేరుతో దందా
- బ్యారేజీపై రాకపోకలకు నిషేధం ఉన్నా మైనింగ్ లారీల పరుగులు
- బ్యారేజీ సిబ్బంది నిర్లక్ష్యం
- సెస్ చెల్లించిన బిల్లులో నగదు వేయని వైనం

ఆత్రేయపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం గ్రావెల్, ఎర్ర కంకర, మట్టి రవాణా చేసే వాహనాలకు పన్ను వసూలు చేసుకోనేలా అప్పటి వైసీపీ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మైనింగ్ వసూళ్లకు పాట దక్కించుకున్న గుత్తేదారులు గత ప్రభుత్వ హయాంలో పంగిడి, రాజమహేంద్రవరం, ఎర్రవరం, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గృహాలకు వినియోగించుకునే గ్రావెల్ ఎర్రకంకరతో వెళ్లే వాహనాలకు యూనిట్ రూ.600 చొప్పున సెస్ పన్ను వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వసూళ్ల బ్రేక్ పడింది. అయితే ఏప్రిల్ వరకు తమకు అనుమతులు ఉన్నాయంటూ సిబ్బంది ఎక్కడపడితే అక్కడ మెటల్ లారీలకు పన్నులు వేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బర్లంక బ్యారేజీపై లారీలు సెస్ వసూలు చేసేవారు. ఏమైందో తెలియదుగాని ఇప్పుడు పేరవరం దానాయమ్మ ఆలయం వద్ద నలుగురు యువకులు లారీల నుంచి సెస్ వసూలు చేస్తున్నారు. దానాయమ్మ గుడివద్ద ఎటువంటి బోర్డులు లేకుండానే యువకులు పంగిడి నుంచి వచ్చే కంకర లారీలకు యూనిట్‌కు రూ.600 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇక్కడ ఎటువంటి బోర్డులు లేకపోవడం, పర్యవేక్షణ సైతం కానరాకపోవడంతో ఈ వసూళ్లపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే లారీ డ్రైవర్లకు ఇచ్చే కంప్యూటర్ బిల్లులో నగదు ఎంత చెల్లించారో లేకపోవడం గమనార్హం. టెండర్ దక్కించుకున్న వారు విధివిధానాలతో కూడిన జీవో కాపీని రోడ్డు చెంతన బోర్డు పెట్టి టోల్‌గేట్ తరహాలో వసూలు చేసి ఎంత చెల్లించారో బిల్లు ఇవ్వాల్సి ఉంది. అటువంటిది ఏమీ లేకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా కాటన్ బ్యారేజీపై భారీ వాహనాల రాకపోకలను గతంలో నిషేధించారు. ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, మోటార్‌సైకిళ్లకు మాత్రమే బ్యారేజీపై వెళ్లేందుకు అనుమతులు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా విజ్జేశ్వరం వద్ద బ్యారేజీపై లారీలు వెళ్లకుండా గడ్డర్లు ఏర్పాటు చేశారు. రెండు యూనిట్ల లారీకి పైబోర్డు తొలగించి గడ్డర్లు కింద నుంచి బ్యారేజీ మీదుగా లారీలు, ట్రాక్టర్లు పరుగులు పెడుతున్నాయి. బ్యారేజీ పర్యవేక్షించాల్సిన సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ రాత్రి పగలు వెళ్తున్న లారీలకు రైట్ చెబుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పంగిడి నుంచి వందలాది లారీలు రాజమహేంద్రవరం బొబ్బర్లంక మీదుగా రావులపాలెం, కోనసీమ వైపునకు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రాత్రి వేళల్లో అక్రమ ఇసుక లారీలు సైతం బ్యారేజీ మీదుగా తరలిపోవడంతో బ్యారేజీకి ముప్పు వాటిల్లే ప్రమాదం సైతం పొంచి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విజ్జేశ్వరం నుండి బ్యారేజీ మీదుగా బొబ్బర్లంక నుంచి అమలాపురం వెళ్తున్న లారీలు, ట్రాక్టర్ల వద్ద సెస్ వసూళ్ల దందా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ విషయాలపై దృష్టి పెట్టాల్సి ఉంది.



మైనింగ్ సెస్ వసూళ్లు ఇలా..



విజ్జేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన గడ్డర్లు

అరుపులు.. కేకలతో దద్దరిల్లిన కౌన్సిల్ సమావేశం

- కాంట్రాక్టరుకు షాపు లీజు అంశంపై అమలాపురం కౌన్సిల్ సమావేశంలో రచ్చరచ్చ
- సమాధానం చెప్పాలని విపక్షాలు.. సమావేశం జరపాలని అధికారపక్షం
- మున్సిపల్ ఛైర్మన్ చాంబర్ ముట్టడింపు



కౌన్సిల్ సమావేశంలో అధికార, విపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం.. చైర్‌పర్సన్ వద్ద నిరసన దృశ్యం

అమలాపురం టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అరుపులు కేకలతో దద్దరిల్లింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట మీసేవ కేంద్ర భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇచ్చిన అంశంపై విపక్ష టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మండిపడ్డారు. లీజు రిజిస్ట్రేషన్ చేయించకుండా కాంట్రాక్టరుకు ఎలా ఇచ్చారని.. కౌన్సిల్ ఆమోదం అవసరం ఉందా లేదా అని మండిపడ్డారు. స్పష్టమైన సమాధానం చెప్పాలని, కాంట్రాక్టరుతో అధికారులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ విపక్ష కౌన్సిలర్లు ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి చాంబర్‌ను ముట్టడించారు. ఒక దశలో జనసేన కౌన్సిలర్ పిండి అమరావతి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి నుంచి వస్తున్న వ్యర్థాలను కవర్‌లో తీసుకు వచ్చి ఛైర్మన్ ఎదుట పెట్టారు. సమావేశం జరగకుండా అడ్డుకోవడమేమిటి, ఎజెండాలో లేని అంశాలను చర్చించేందుకు జీరో అవర్ ఉంది కదా అని అధికారపక్ష వైసీపీ కౌన్సిలర్లు సైతం ఛైర్మన్ చాంబర్‌ను ముట్టడించారు. తీవ్ర వాదోపవాదాల అనంతరం గంటన్నర తరువాత ఎజెండా అంశాలపై చర్చ జరిగింది. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పురపాలక సంఘానికి సంబంధించిన షాపులను సబ్ లీజులకు ఇచ్చే వ్యాపారం జోరుగా జరుగుతున్నా పట్టించుకోరా అని అధికారులను నిలదీశారు. రాజా ఆసుపత్రి లీజుటైం పూర్తయినా మళ్లీ ఎలా లీజుకు ఇచ్చారని, అసలు ఎన్ని షాపులు ఉన్నాయని ప్రశ్నించారు. కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఆర్వో శ్రీలక్ష్మి మాట్లాడుతూ పురపాలక సంఘం తరపున 101 షాపులు ఉన్నాయని, సబ్ లీజులకు ఇచ్చిన అంశంపై విచారణ జరపాలని ఇప్పటికే ఆదేశాలిచ్చామని త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఓఎన్జీసీ సంస్థ చెల్లించాల్సిన రాయితీలపై కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసినా ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించగా అప్పటి నుంచి రైల్వేశాఖకు కేటాయించిన షాపులు రెండు ఖాళీగానే ఉన్నాయని, నామినల్ అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రైల్వేశాఖ ముందుకు వస్తేనే లీజుకు ఇచ్చే అవకాశం ఉంటుందని కమిషనర్ తెలిపారు. టీడీపీ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మీ సేవ కేంద్రం భవనంపై గత కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఏంచేశారని ప్రశ్నించారు. రూ.9.35 లక్షలు ట్రాన్స్‌ఫార్మర్ కోసం మున్సిపాలిటీ నుంచి చెల్లించిన సొమ్ములను నిలుపుదల చేశామని కమిషనర్ వివరణ ఇచ్చారు. మూలనపడ్డ ట్రాక్టరుకు రూ.20వేలతో మరమ్మతులు చేయించాల్సి ఉండగా ఇప్పటికీ పట్టించుకోలేదు.. రూ.9.35 లక్షలు కాంట్రాక్టరు ఏర్పాటుచేసుకునే షాపునకు ట్రాన్స్‌ఫార్మర్ నిమిత్తం ఎలా చెల్లించారో చెప్పాలని పట్టుబట్టారు. రిజిస్ట్రేషన్ లేకుండా షాపులు అద్దెకు ఇస్తే చెల్లుబాటు అవుతుందా అని ప్రశ్నించగా షాపులు రిజిస్ట్రేషన్ చేయించడానికి ముందుకు రావడంలేదని ఆర్వో అనడంతో సభ్యులు మండిపడ్డారు. దీంతో అధికార, విపక్ష కౌన్సిలర్ల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక దశలో లీజుల వ్యవహారంపై స్పష్టమైన సమాధానం చెప్పాలని విపక్ష కౌన్సిలర్లు ఛైర్మన్ చాంబర్‌ను చుట్టుముట్టారు. కౌన్సిల్‌కు తెలియకుండా, కౌన్సిల్ ఆమోదం లేకుండా షాపులీజులు ఎలా ఇస్తారని కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి ప్రశ్నించారు. గంటన్నర అయినా ఎజెండా అంశాలు ప్రారంభం కాకపోవడంతో అధికార పక్ష వైసీపీ కౌన్సిలర్లు సైతం ఛైర్మన్ చాంబర్‌ను చుట్టుముట్టారు. వాగ్వాదం అనంతరం సమావేశం ప్రారంభంకాగా సభ్యుల ఆమోదం లేకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఖండించారు. కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, చిత్రపు రామకృష్ణ, యేడిద శ్రీను, ఆశెట్టి నాగదుర్గ, తిక్కా సత్యలక్ష్మి, దొమ్మేటి రాము, తిక్కిరెడ్డి వెంకటేష్, గండి దేవీ హారిక, పడాల శ్రీదేవి, గొలకోటి విజయలక్ష్మి, నాగారపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఈదరపల్లి సబ్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి విశ్వరూప్ ఆధ్వర్యంలో ర్యాలీగా వస్తున్న వైసీపీ నేతలు

విద్యుత్ చార్జీల పెంపుదలను నిలుపుదల చేయాలి

వైసీపీ ఆధ్వర్యంలో పోరుబాట

అమలాపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట నిలుపుకుని పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. అమలాపురం హైస్కూలు సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఈదరపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. గృహ వినియోగదారులపై మోపిన రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీలను వెనక్కు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని, వ్యవసాయ పంపు సెట్లకు వెంటనే కనెక్షన్లు మంజూరు చేయాలని నినాదాలతో హోరెత్తించారు. ఒకదశలో గేట్లు తోసుకుని సబ్‌స్టేషన్‌లోకి చేరుకున్నారు. అనంతరం విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీలు పందిరి శ్రీహరి, గెడ్డం సంపదరావు, నాయకులు పినిపే శ్రీకాంత్, చెల్లుబోయిన శ్రీకాంత్, బొంతు గోవిందుశెట్టి, సంసాని బులినాని, కామిశెట్టి శ్రీనివాసరావు, చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఐ

100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

7

నేటి నుంచి క్రియ చిన్నారుల పండుగ

ప్రతి వీధీ.. ఓ చరిత్రే!

- ఆంధ్రజ్యోతి/రాజమహేంద్రవరం



రాజమహేంద్రిలో ప్రతిచోటు వెనుకా ఎంతో ఆసక్తి
బ్రిటీషర్లకూ తగు గౌరవం
లిస్టర్, ఇన్నీస్ పేరుతో ప్రాంతాలు

రాజమహేంద్రవరం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన నగరం అనడంలో సందేహం లేదు. గోదావరి తీరం శిలామృత్తిక (ఫాసిల్)గా ఏర్పడిందని చరిత్రకారుల అభిప్రాయం. ఇలా మట్టి శిలారూపంలోకి రావాలంటే లక్షల ఏళ్ల కాలం పడుతుంది. అంటే ఈ ప్రాంతానికి అంత వయసు ఉందని అర్థం చేసుకోవచ్చు. అలాంటి ఈ ప్రాంతం ఎన్నో చారిత్రక ఆనవాళ్లకు ఆలవాలం కావడం అతిశయోక్తి కాదు. ఇక్కడ చిన్న పల్లెటూరిగా అంకురించి నేడు వృక్షంగా విస్తరించి ఐదు లక్షల పైబడి జన సంచారంతో రోజురోజుకూ అభివృద్ధిలో దూసుకుపోతూ నగరపాలక సంస్థ స్థాయికి చేరుకొంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ నగరంగా పేరు గడించింది. గోదారమ్మ ఒడ్డున ఆధ్యాత్మిక ధామంగా విలసిల్లుతోంది. ఇక్కడ ప్రతి ప్రాంతం వెనుకా ఓ చరిత్ర దాగి ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని బ్రిటీషర్లకూ సముచిత గౌరవాన్ని ఇవ్వడం మన చూడవచ్చు. రాజమహేంద్రిలోని ఐతిహ్యాల్లో కొన్నిటిని 'ఆంధ్రజ్యోతి' మీ ముందుకు తీసుకొస్తోంది.



ఆర్యాపురంలో ఉన్న లిస్టర్ పేట మున్సిపల్ స్కూల్

● లిస్టర్ పేట

ప్రస్తుత ఆర్యాపురమే లిస్టర్‌పేట. 1895లో రాజమహేంద్రవరంలో బ్రిటిషర్ అయిన లిస్టర్ సబ్‌కలెక్టరుగా పనిచేశారు. 130 ఎకరాల ప్రభుత్వ భూములను 3 వీధులతో ప్లాట్లుగా విభజించి పేదలకు నామమాత్రపు ధరకు ఇచ్చారు. వారిలో 90 శాతం పురోహితులు ఉన్నారు. అందువల్ల ఆయన పేరుతో లిస్టర్ పేటగా స్థిరపడింది. ఈ పేట 1897లో మునిసిపాలిటీలో విలీనమైంది. అయితే ఇక్కడ అధికశాతం పురోహితులు ఉండడం వల్ల 'ఆర్యపురం' అని నామకరణం చేసుకున్నారు. అయితే అధికారిక రికార్డుల్లో లిస్టర్ పేటగానే ఉండేది. 1935లో ఇక్కడ సత్యనారాయణస్వామి గుడి కట్టారు. సంఘ సేవకులు, మాజీ మంత్రి ఏబీ నాగేశ్వరరావు ఈ ప్రాంతంలోనే నివాసం ఉండేవారు. చరిత్రకు మౌన సాక్ష్యంగా నిలిచిన లిస్టర్ పేట మునిసిపల్ స్కూలును ఈనాటికీ ఇక్కడ చూడొచ్చు.

● ఇన్నీస్ పేరున...

లిస్టర్‌పేట కంటే ముందే ఇన్నీస్ పేట ఏర్పడింది. 1865 ప్రాంతంలో సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఇన్నీస్ చొరవతో ఇక్కడ నివాస ప్రాంతం వచ్చింది. కుమారి టాకీస్, జూనియర్ కళాశాల, తూర్పువైపున రాజవీధి (మెయిన్ రోడ్) వరకూ ఈ పేట విస్తరించి ఉండేది. ఇక్కడ మొదటిగా ఆంధ్రభీష్మగా పేరుగాంచిన న్యాపతి సుబ్బారావు పంతులు ఇల్లు కట్టుకొన్నారు. 1870లో నాళం వారి సత్రం నిర్మించారు. ఇక్కడ అన్న వితరణ జరిగేది. రాజమండ్రి రైల్వే స్టేషను వైపు నుంచి వస్తుంటే రాజవీధి మొదట్లో ఈ సత్రం ఉండడంతో జనాదరణ ఎక్కువగా ఉండేది. ఇన్నీస్ పేటలోని మొదటి వీధిని వైస్రాం రోడ్డు అని పిలిచేవారు. ఈయన కూడా సబ్ కలెక్టరే కావడం గమనార్హం. తర్వాత మయూరీ టాకీస్ రోడ్డుగా మారింది. 1910 తర్వాత ఇన్నీస్ పేట కాస్త కుచించుకొని రాజవీధి నుంచి ట్రైనింగ్ కళాశాల వరకూ పరిమితమైంది. అప్పట్లో ఇన్నీస్ పేటను ఆనుకొని హుకుంపేట పరిధి ఉండేది. ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం 1907లో ఇన్నీస్‌పేటను ఆనుకొని ఉన్న హుకుంపేటలో వీరేశలింగం పంతులు 6 ఎకరాల భూమిని ఎకరం రూ.1,200 చొప్పున కొనుగోలు చేశారు. శామలా థియేటర్ నిర్మాణం తర్వాత ఈ పేటలోని కొంత భాగం శ్యామలా సెంటర్‌గా పేరు మార్చుకొంది. ఈ ప్రాంతం ఆనాడు లారీల స్టాండులు కావడం వల్ల లారీలతో నిండి ఉండేది. ఇప్పటి టి.నగర్ కూడా ఇన్నీపేట పేటలో భాగమే. 35ఏళ్లపాటు ఈ ప్రాంతంలో త్యాగరాజ ఉత్సవాలు నిరంతరాయంగా జరిగాయి. దీంతో ఈ ప్రాంతానికి పేరు మార్పు చేయాలని గానకళారాధక బుగ్గా పాపయ్య శాస్త్రి పట్టుబట్టారట. దీంతో అప్పటి మునిసిపల్ ప్రత్యేక అధికారి ఎ.సుబ్బారావు చొరవ చూపి గోదావరి గట్టు కింద, రాజవీధి, ఇన్నీస్‌పేటలోని కొంత భాగాన్ని కలిపి త్యాగరాజనగర్ (టి.నగర్)గా పేరు పెట్టారు. త్యాగరాజస్వామి పేరుతో ఏర్పడిన మొట్టమొదటి పేట ఇదేనని చెబుతారు. చెన్నైలోని త్యాగరాయనగర్ ఉన్నా.. అది త్యాగరాయశెట్టి అనే వ్యాపారస్తుడి పేరుతో ఏర్పడింది.



కోటిపల్లి బస్టాండ్ సెంటర్, ఇన్నీస్ పేట రోడ్డు

● జామి, రామదాసు, సీతంపేటలు

విశాఖపట్నం జిల్లాలోని జామి ప్రాంతంలో కరువుకాటకాల వల్ల కొందరు చేనేత కార్మికులు ఇక్కడికి వలస వచ్చారు. వారికి మునిసిపాలిటీ ఒక జామతోట ప్రాంతాన్ని కొని ఇళ్ల స్థలాలను ఇచ్చింది. దీనిని జామిపేటగా పిలిచేవారు. కాలక్రమంలో జాంపేటగా పిలుస్తున్నాం. ఇక్కడి గాంధీ విగ్రహాన్ని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆవిష్కరించారు. ఎడ్ల రామదాసు అనే ఆధ్యాత్మికవేత్త తన కీర్తనల ద్వారా అహింస, నీతి, వేదాంతం, దైవభక్తి వంటి వాటిపై జాగృతం చేసేవారు. ఆయన 1917లో కాలం చేశారు. ఇక్కడ ఆయన సమాధిని ఏర్పాటు చేసి రామదాసు పేటగా పిలుచుకోవడం జరిగింది. ఈ పక్కనే విశ్రాంతిపురం(టీబీ శానిటోరియం)లో క్షయవ్యాధి నివారణ కేంద్రం ఉండేది. ఇక్కడికి వచ్చే రోగుల సంబంధీకులు రామదాసుపేటలో బస చేసేవారు. ఈయన పేరుతో కాకినాడలో కూడా ఒక వీధి ఉంది. కాండ్రేగుల జమిందారు తన తల్లి సీతమ్మ పేరుతో బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఒక చెరువును కూడా తవ్వించారు. దానిని సీతమ్మ చెరువుగా పిలిచేవారు. ఈ ప్రాంతమే ఇప్పుడు మనం పిలుస్తున్న సీతంపేట.



● ఇదే పాల్ చౌక్

ప్రస్తుతం కోటిపల్లి బస్టాండ్ ఉన్న ప్రాంతమే ఇది. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో వందేమాతరం ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్న రోజులవి. 1907లో ప్రముఖ ఉద్యమకారుడు బిపిన్ చంద్రపాల్ నగరానికి వచ్చారు. ఐదు రోజులపాటు ఉత్తేజితం చేసే ప్రసంగాలు చేశారు. ఆ సమయంలో ప్రసిద్ధ కవి చిలకమర్తి లక్ష్మీ నరసింహారావు.. 'భరత ఖండంబు చక్కని పాడియావు, హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ, తెల్లవారను గడుసరి గొల్లవారు, పితుకుచున్నారు మూతులు బిగియకట్టి' అనే పద్యాన్ని అప్పటికప్పుడు ఆశువుగా రచించి వినిపించారు. ఇది బ్రిటిష్ ప్రభుత్వాన్ని వణికించడంతో కోర్టులో కూడా విచారణ జరిగింది. ఇలా ఆ పద్యం దశదిశలా వ్యాపించింది. దీంతో ఈ ప్రాంతానికి పాల్ చౌక్ అనే పేరు వచ్చింది. బస్టాండ్, లారీ స్టాండ్ (జెట్టీ టవర్స్ ప్రదేశం), అక్కడి 3 పార్కుల విశాల ప్రాంతాన్ని పాల్‌చౌక్‌గా వ్యవహరించేవాళ్లు. ఆనాడు గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, ప్రకాశం పంతులు, సరోజిని నాయుడు వంటి మహానుభావులు ఎందరో ఇక్కడ ప్రసంగించారు. ఇలాంటి చారిత్రక ప్రదేశాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఈ ప్రాంతంలో ప్రైవేటు భవనాలకు అనుమతులు కూడదని ఆనాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు ఉత్తర్వులు కూడా ఇచ్చారు.



● సుబ్రహ్మణ్య మైదానం

ఆనం కళా కేంద్రం పక్కన ఉన్న సుబ్రహ్మణ్య మైదానం అందరికీ సుపరిచితమే. పూర్వం ఇది పోలీస్ పెరేడ్ గౌండ్. స్వాతంత్ర్యం సిద్ధించిన రోజున కల్నల్ డీఎస్ రాజు.. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, సీతానగరంలోని గౌతమీ సత్యాగ్రహాశ్రమం వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం పేరున ఈ మైదానాన్ని సుబ్రహ్మణ్య మైదానంగా ప్రకటించారు. రాజమండ్రికి రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా, నేతాజీ అంతరంగిక వైద్యులుగా డీఎస్ రాజు పనిచేశారు. ఒకప్పుడు ఇక్కడ పోలీస్ స్టేషను నిర్మాణానికి జనం ఒప్పుకోలేదు. మధ్యలో గోడ కడతామని చెప్పినా వ్యతిరేకత ఎదురైంది. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ఆనవాలును కూడా చరిత్రలో కలిపేశారు.

సముద్ర తీర భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి: కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీర భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ తీర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. వారం చివరి రోజు, పండుగల సందర్భాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు సముద్ర తీరానికి వస్తున్నారన్నారు. మత్స్యకారులు వేట సందర్భాల్లో ఎటువంటి మరణాలు సంభవించకుండా తీర భద్రత సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిని సమన్వయం చేసుకుని షెడ్యూల్ ప్రకారం పెట్రోలింగ్ చేయాలన్నారు. సముద్ర స్నానాల సమయంలో ప్రజలు సముద్రం లోపలికి ఎక్కువగా వెళ్లకుండా భద్రతా సిబ్బంది పర్య వేక్షణ చేయాలన్నారు. మత్స్యకారులు వేట సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ మార్పులపై మత్స్యకార ప్రాంతాల్లో అధికారుల బృందాలు నిరంతరంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కాకినాడ ఎన్టీఆర్ బీచ్, సూర్యారావుపేట బీచ్, ఉప్పాడ బీచ్‌ల వద్ద మరింత సమర్థవంతంగా భద్రతా చర్యలు చేపట్టేందుకు వాచ్ టవర్స్ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, బోట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఏపీ మెరైన్ సెక్యూరిటీ పోలీస్ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు, ఇండియన్ కోస్ట్‌గార్డ్ సహాయక ఇంజనీర్ ధనుంజయ్, జిల్లా మత్స్య శాఖ అధికారి కరుణాకర్, నేవీ లెఫ్టినెంట్ కమాండర్ ఆవేశ్, వాకలపూడి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలు, తాబేళ్లను పరిరక్షించాలి

కాకినాడ జిల్లా స్థాయి అటవీ కమిటీ సమావేశంలో కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలు, సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అటవీ, మత్స్య, మెరైన్ పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాకినాడ జిల్లా స్థాయి అటవీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలల పరిరక్షణ, నిర్వహణ నియమం-2017 ప్రకారం కాకినాడలో చిత్తడి నేలలను నోటిఫై చేయాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలకు ఆనుకుని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచుకుని ఈ చిత్తడి నేలలో అరుదైన మొక్కలు, పక్షులు, జంతువులు, చేపలు గుడ్లు పెట్టడానికి చాలా అనుకూలంగా ఉంటాయన్నారు. కోరింగ వన్యప్రాణుల అభయారణ్యంలో ఎకో, సెన్సిటివ్ జోన్ మాస్టర్ ప్లాన్ తయారీకి తిరువనంతపురంలోని పర్యావరణ అభివృద్ధి కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. జలాచర జీవుల్లో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు ఎంతో వైవిధ్యంతో కూడుకున్నవన్నారు. వీటి మరణాలను నిరోధించేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. సముద్ర తాబేళ్లు గుడ్లు పెట్టడానికి ప్రతిఏటా డిసెంబరు నుంచి మే నెల వరకు సముద్ర తీరానికి వస్తూ ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో చేపలు పట్టే వలలు, ట్రాలర్లలో ప్రమాదవశాత్తు చిక్కుకుని మరణాలు సంభవిస్తున్నాయన్నారు. డిసెంబరు నుంచి మే నెల వరకు సముద్ర తాబేళ్లు గూడు కట్టే ప్రదేశాల చుట్టూ ఐదు కిలోమీటర్ల వ్యాసార్థంలో మెకనైజ్డ్ ట్రావెర్ల ద్వారా చేపలు వేటాడకుండా అటవీ, మెరైన్, కోస్టుగార్డు, మత్స్యశాఖల విభాగాలు సముద్రంలో నిరంతరం ఉమ్మడి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో కాకినాడ జిల్లా అటవీ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి కరుణాకర్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు గణపతి, కాకినాడ, కోరంగి ఫారెస్ట్ రేంజర్లు శ్రీదీప్తి, వరప్రసాద్ పాల్గొన్నారు.

'కడియం నర్సరీలు ప్రయోగశాలలు'



కర్ణాటక రాష్ట్ర ఉద్యానవన శాఖాధికారులకు పుష్పగుచ్ఛాలు ఇస్తున్న స్థానిక నర్సరీల యజమానులు

కడియం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలోని నర్సరీలు ప్రయోగశాలలు అని కర్ణాటక రాష్ట్ర ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వనాథశర్మ పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 25 మంది ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం శ్రీదుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనుతో కలిసి సత్యదేవ, పల్ల వెంకన్న, సత్యనారాయణ, వెంకట శ్రీనివాస, గౌతమి నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. పలు రకాల మొక్కల శాస్త్రీయ నామాలు, వాటి విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పండ్ల జాతి మొక్కలు, పుష్పాల మొక్కలను తిలకించారు. కడియపులంక అంతర్ రాష్ట్ర పూల మార్కెట్‌ను పరిశీలించి మార్కెట్ విధివిధానాలపై యాజమాన్యాన్ని అడిగారు. మార్గాని సత్యనారాయణ, గంగుమళ్ల సత్యనారాయణ, పల్ల సత్తిబాబు, పుల్లా పెదసత్యనారాయణ, మల్లు పోలరాజు, చిలుకూరి త్రిమూర్తులు, మార్గాని వీరబాబు, ధర్మాసనం వెంకటరమణ, పాటంశెట్టి బాబ్జీ, పాటంశెట్టి బూరయ్య మొక్కల విశిష్టతలను వివరించారు.



మన్మోహన్‌సింగ్‌కు నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో ఆయన పాలనలో చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకుంటున్నారు. దేశానికి ఎంతో సేవ చేసిన ఆ మహనీయుడిని స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని బండారులంకకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు మాడా రాము మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తూ క్యారికేచర్ గీశారు. పలువురు కళాకారులు, చిత్రకారులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి/అమలాపురం రూరల్



ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో ఎంఎం పళ్లంరాజు

మన్మోహన్ సింగ్ బ్రిలియంట్ ప్రధాని

ప్రత్తిపాడు/సామర్లకోట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ బ్రిలియంట్ ప్రధాని అని మాజీ కేంద్రమంత్రి ఎంఎం పళ్లంరాజు అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో శుక్రవారం ఆయన ఘన నివాళి ప్రకటించారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ ఎంతో కృషి చేశారని, ఆర్థిక శాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. మానవ వనరుల అభివృద్ధి కోసం యూపీఏ ప్రభుత్వంలో మన్మోహన్‌సింగ్ మంత్రివర్గ సహోద్యోగిగా తనను చేర్చడం ద్వారా ప్రధానిగా ఎంతో విశ్వాసాన్ని ఉంచారని గుర్తుచేసుకున్నారు.





మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌తో మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, జీవీ హర్షకుమార్

ద్రాక్షారామ ప్రజలకు మేలు చేసిన మన్మోహన్ : మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ గ్రామ ప్రజలకు ఎనలేని మేలు చేశారని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. ద్రాక్షారామ చారిత్రక ప్రాంతం కావడం వల్ల అక్కడ ఒక ఇటుక తీయడానికి, వేయడానికి కూడా అనుమతి లేదని... దీనిపై తాను అమలాపురం ఎంపీగా ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే పిల్లి సుభాష్‌చంద్రబోసు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇది పురావస్తు శాఖ పరిధిలో ఉండడం వల్ల కేంద్రస్థాయిలో కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో. తాను స్వయంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లగా... మొదట ఆయన ఆలోచించి తర్వాత అధికారులకు ఆదేశం ఇవ్వడంతో ద్రాక్షారామ నిబంధనలు తొలగించారని, ప్రజలందరికీ మేలు జరిగిందని చెప్పారు.

ఉత్తమ నాయకుడు : ఉండవల్లి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఉత్తమ నాయకుడు. ఆయన మృతి తీరని లోటు. ఆయనకు ఉత్తమ గతులు ప్రాప్తించుగాక అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ నివాళి అర్పించారు.



ఎస్.యానాంలో మన్మోహన్‌కు నివాళులర్పిస్తున్న వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారిణులు

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కి నివాళిగా

నేటికి వాయిదా పడిన బీచ్ వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అస్తమించడంతో ఎస్.యానాంలో శుక్రవారం ప్రారంభం కావలసిన నేషనల్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలను ఒకరోజు వాయిదా వేసినట్టు వాలీబాల్ అసోసియేషన్ ప్రకటించింది. శని, ఆదివారాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్టు వివరించారు. శుక్రవారం ఎస్.యానాం బీచ్‌లో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం అధ్యక్షతన సంతాప సమావేశం నిర్వహించారు. ఎనిమిది రాష్ట్రాల నుంచి ఎంతో వ్యయప్రయాసలకోర్చి క్రీడాకారిణులు వచ్చారన్నారు. ఈ కారణంగా పోటీలను కొనసాగించక తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడి స్వామినాయుడు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే భీమరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, వాటర్ డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పినిశెట్టి నరసింహారావు, సత్తి చిన్నా, రవణం మధు, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్, రంకిరెడ్డి కాశీ, వుంద్రు వెంకట మునలయ్య, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, వివిధ రాష్ట్రాల క్రీడాకారిణులు పాల్గొన్నారు.

విద్యార్థుల పెన్సిల్ చిత్రాల్లో మన మాజీ ప్రధాని





విద్యార్థులు గీసిన మన్మోహన్‌సింగ్ పెన్సిల్ చిత్రాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ స్కూలుకు చెందిన విద్యార్థులు గీసిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈదరాడ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న డి.అలేఖ్యస్ఫూర్తి, యెరుబండి నాగమణికార్తిణి పెన్సిల్‌తో ఈ చిత్రాలను గీశారు. అచ్చుగుద్దినట్టు మన్మోహన్‌సింగ్ చిత్రాలు గీసిన విద్యార్థినులను హెచ్‌ఎం సాయిబాబు, డ్రాయింగ్ మాస్టారు బత్తుల శ్రీనివాస్ అభినందించారు.

- మామిడికుదురు

ప్రజల పక్షాన సీపీఐ

31 వరకూ సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ సభలు
రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల తరపున పోరాటం సాగిస్తామని ఆయన వెల్లడించారు. సీపీఐ శత వసంతాల సందర్భంగా శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని సుబ్రహ్మణ్యమైదానంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. వందేళ్ల భారత దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటామని, దాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 31వ తేదీ వరకూ సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ సభలు జరుగుతాయని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, నగర కార్యదర్శి కొండలరావు, జట్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.


సభకు హాజరైన కార్మికులు

వైసీపీ హయాంలో సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి


శివకోడులో జరిగిన సభలో మాట్లాడుతున్న శ్రీదేవి

రాజోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40వేల కోట్లు పక్కదారి పట్టాయని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ఆరోపించారు. చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారి జిల్లాకు విచ్చేసిన ఆమెకు ఎన్డీఏ నాయకులు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడులో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. శివకోడులో శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో జరిగిన సభలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలకు ఎస్సీ కార్పొరేషన్, విదేశీ విద్య వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌లు ఇచ్చిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. జగన్ పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, వైసీపీ విద్యుత్ చార్జీలపై ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ప్రస్తుతం అమలవుతున్న ఉన్నతి పథకాలు, త్వరలో అమలయ్యే ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక, ఇ-ఆటోలు, షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్సులు, ఎన్ఎస్ఎఫ్ డీసీ, ఎన్ఎస్కే ఎఫ్‌డీసీ రికవరీలపై సమీక్ష చేపట్టారు. నిరుపేదలైన ఎస్సీ లబ్ధిదారులకు ఉపాధి కల్పించేందుకు మెరుగైన సేవలు అందించడం ద్వారా పథకాలు అమలు చేయడంలో చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉన్నతి పథకం ద్వారా కాకినాడ జిల్లాలో 67 మందికి 69.50లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో 74 మందికి రూ.92.50లక్షలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 89 మందికి రూ.76.50లక్షలతో ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. శ్రీదేవి దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెస్పీ అధికార ప్రతినిధి ఎన్.సత్యనారాయణ, శెట్టెం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఎస్సీ డైరెక్టర్లు వల్లూరి రాజా, ఎం.చంద్రశేఖర్, జె.సత్యవతి,కార్పొరేషన్ సిబ్బంది తదితరులున్నారు.

కొల్లూరికి తెలుగు రచయితల మహాసభల ఆహ్వానం


కొల్లూరి

అమలాపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల28, 29తేదీల్లో విజయవాడ కేబీఎన్ కళాశాలలో జరిగే ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరికి ఆహ్వానం అందింది. 28న పద్మశ్రీ ఆశావాది ప్రకాశరావు సభావేదికపై జరిగే మొదటి కవి సమ్మేళనంలో కొల్లూరి పాల్గొంటారు. గతంలో విజయవాడలో జరిగిన 3, 4, 5 ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో కొల్లూరి పాల్గొనడం విశేషం.

4 నుంచి అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

అమలాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 2025 ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అమలాపురం ఆర్డీవో కె.మాధవి తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా జనవరి 2న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 7న శ్రీలక్ష్మీనరసింహస్వామికల్యాణం, 8న రథోత్సవం, 12న స్వామివారి చక్రస్నానం, 13న తెప్పోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

వాహనాలు ఢీకొని యువకుడి మృతి



శంఖవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి-నెల్లిపూడి రహదారిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ప్రత్తిపాడు మండలం వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి అప్పన్న (30) తన అన్న భార్య మురుకుర్తి రాణిని తీసుకుని బ్యాంకు పనిపై కత్తిపూడి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా కత్తిపూడి శివార్లలో ఎదురుగా ఎదురుగా వస్తున్న వాహనం, వీరి వాహనం పరస్పరం ఢీకొన్నాయి. రాణి, అప్పన్నలను స్థానికుల సాయంతో కాకినాడలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పన్న చికిత్స పొందుతూ మృతి చెందాడు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు అప్పన్న (ఫైల్‌ఫొటో)

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... శుక్రవారం ఉదయం 7.30గంటల సమయంలో తుని ఉల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్య సుమారు 35 నుంచి 40 ఏళ్ల కలిగిన వ్యక్తి రైలు నుంచి జారి పడినట్టు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. తెలుపు రంగు ఛాయ కలిగి 5.5అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కానీ, 9490 619020 నెంబర్లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.


జారిపడిన వ్యక్తి మృతదేహం

ఆత్మహత్యాయత్నానికి నిర్ణయించుకున్న
వివాహితను అడ్డుకున్న హెచ్‌సీ


వివాహితను భర్తకు అప్పగిస్తున్న హెచ్‌సీ

అన్నవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రైల్వే స్టేషన్‌లో పిల్లలతో ఆత్మహత్యాయత్నానికి నిర్ణయించుకున్న వివాహితపై అన్నవరం జీఆర్పీ హెచ్‌సీ శ్యామ్‌కు అనుమానం వచ్చి విచారించడంతో భర్తకు విషయం తెలియపరిచి ఆయనకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.... నక్కపల్లి మండలం నామవరానికి చెందిన కిల్లాడ లోవలక్ష్మి భర్తతో గొడవపడి ఒంటరిగా జీవిస్తోంది. పిల్లలను భర్తకు అప్పగించి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుంది. భర్త పిల్లల్ని తీసుకోకపోవడంతో అన్నవరం రైల్వేస్టేషన్ వద్ద అనుమానంగా తిరుగుతోంది. ఆమె గురించి అక్కడ విధుల్లో ఉన్న జీఆర్పీ కానిస్టేబుల్ శ్యామ్ తుని రైల్వే ఎస్ఐకు సమాచారమిచ్చారు. భర్తను రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చి భార్య, పిల్లల్ని అతడికి అప్పగించారు. శ్యామ్‌ను అక్కడి ప్రయాణికులు అభినందించారు.

రూ.16వేలు జరిమానా చెల్లించలేనన్న వ్యక్తికి
ఆరునెలల 15రోజుల జైలుశిక్ష

ఆలమూరు కోర్టులో న్యాయమూర్తి సంచలన తీర్పు

ఆలమూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి సాధారణంగా జరిమానా వేస్తారు. అయితే ఆ జరిమానా చెల్లించలేనని చెప్పడంతో ఓ వ్యక్తికి ఆరునెలల 15రోజుల జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు కోర్టులో శుక్రవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన కెవీ.వరప్రసాద్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా అక్టోబరు 26న ఆలమూరు పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. అయితే అతడు అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకపోకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. శుక్రవారం వరప్రసాద్‌ను పట్టుకుని ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ ఎదుట హాజరు పరిచారు. దీంతో రూ.16వేలు జరిమానా చెల్లించాలని తీర్పు చెప్పారు. ఈ తీర్పుపై వరప్రసాద్ మాట్లాడుతూ.. అంతమొత్తం నేను చెల్లించలేనని చెప్పడంతో ఆరునెలల 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పు చెప్పారు.

జియో.. జీరో!

- ఆనవాలు లేకుండా కొట్టుకొనిపోయిన జియోట్యూబ్
- ఉప్పాడ తీరంలో మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు జాడలేని వైనం
- కెరటాల రాపిడికి గులకరాళ్లుగా మారిన బండరాళ్లు


సూరాడపేటలో జియోట్యూబ్ నిర్మించిన ప్రాంతం


కెరటాల రాపిడికి అరిగిపోయి చిన్న గులకరాళ్లుగా మారిన బండరాళ్లు

కొత్తపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సముద్రకోత నుంచి తీరప్రాంత రక్షణకు నిర్మించిన జియో ట్యూబ్‌టెక్నాలజీ నామరూపాలు లేకుండా సముద్రంలో కలిసిపోయింది. తుఫాన్లు, అల్పపీడనాలకు, పౌర్ణమి, సముద్రంలో ప్రతిరోజూ ఏర్పడే పోటు, పాట్లతో కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తీర ప్రాంతం క్రమేపీ కోతకు గురవుతూ వస్తోంది. సముద్రకోత నివారణకు పదేళ్ల కిందట ఉప్పాడ శివారు మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు కిలోమీటరున్నర పొడవునా జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణగోడ నిర్మించారు. సముద్రకోతకు గురయ్యే వ మాయాపట్నం నుంచి కొత్తపట్నం వరకు ఒడ్డున మొలలోతు కెనాల్ ఏర్పాటు చేశారు. ఆ కెనాల్ కింద నుంచి ఒడ్డుపై నుంచి ఐదు మీటర్ల ఎత్తులో బండరాళ్లను గాబియాన్ సంచుల్లో నింపి రక్షణ గట్టును నిర్మించారు. దీంతో తుఫాన్ల సమయంలో ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలు ఒడ్డును నిర్మించిన గాబియాన్ సంచుల్లో బండరాళ్లను ఢీకొని విడిపోవడంతో కెరటం బలం తగ్గడంతో కోత నివారణ సాధ్యమవుతుందన్న కోణంలో జియోట్యూబ్ నిర్మించారు.

కూటమి ప్రభుత్వంపై బాధ్యత


దశాబ్ధకాలంపాటు ఎన్నో తుఫాన్‌లను తట్టుకుని నిలబడిన జియోట్యూబ్ ఇటీవల వరుసగా ఏర్పడిన తుఫాన్‌లు, వాయుగుండాలతో నామరూపాలు లేకుండాపోయింది. ఇది పాడవడానికి సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, తీరప్రాంతాలకు చెందిన ఆకతాయిలు జియోట్యూబ్‌పై ఆడుకుంటూ బ్లేడ్‌లతో గాబిసంచులకు కట్టిన నైలాన్ తాళ్లను కట్ చేయడం ప్రధాన కారణం. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కోనపాపపేట నుంచి ఉప్పాడ వరకు జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ కల్పిస్తామని హామీ ఇవ్వడం విధితమే. రక్షణ చర్యలు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత. అదే బాధ్యత సముద్రకోతనుంచి గ్రామాన్ని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్న టెక్నాలజీని బాధ్యతతో పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మత్స్యకార పెద్దలు చెబుతున్నారు. జియోట్యూబ్ టెక్నాలజీ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి
క్రియ చిన్నారుల పండుగ

జేఎన్‌టీయూకేలో ఏర్పాట్లు, ముఖ్య అతిథిగా డాక్టర్ జయప్రకాశ్ నారాయణ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీల క్రియ పిల్లల పండుగ డిసెంబరు 28 నుంచి 29 వరకు రెండురోజుల పాటు కాకినాడ జేఎన్‌టీయూకేలో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి చిన్నారుల పండుగ ప్రారంభంకానుంది. ముఖ్య అతిథిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హాజరు కానున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఈ పోటీల్లో పాల్గొనేందుకు సుమారు 10వేలు మంది వరకు విద్యార్థులు హాజరుకావచ్చని నిర్వాహకులు తెలిపారు. 2రోజుల పాటు 28 విభాగాల్లో నిర్వహించనున్న చిన్నారుల పండుగలో తొలి రోజు శనివారం చిన్నారులకు నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, ఏకపాత్రాభినయం, పాటలు, పోస్టర్ ప్రజెంటేషన్, సైన్ ప్రయోగాలు, గ్రూపు డిబేట్, గణితం, క్విజ్, వ్యాసరచన, కథా రచన, విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ జరుగుతాయి. ఆదివారం జానపద నృత్యం (బృందం), విచిత్ర వేషధారణ, బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, మాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మక వస్తువుల తయారీ, మైమ్, మట్టితో బొమ్మలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 5వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 6,7 తరగతులు జూనియర్స్ విభాగం.. 8, 9, 10వ తరగతులు సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు.

ఉప్పాడలో బంగారు రజను వేట


ఉప్పాడలో సముద్రం ఒడ్డున బంగారు రజను సేకరిస్తున్న మహిళలు



కొత్తపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాల అనంతరం ఉప్పాడ తీరంలో బంగారు రజను వేట ప్రారంభమైంది. కెరటాలు సాధారణ స్థాయిలో ఒడ్డుకు రావడం, వెనక్కి వెళ్లడం జరుగుతుంది. అల్పపీడనాలతో ఉప్పొంగిన సముద్ర కెరటాలు ఒడ్డును బలంగా తాకేవి. అప్పట్లో కెరటాల వేగానికి ఒడ్డున నిలబడి ఇసుకలో బంగారు రజను సేకరించడం వీలుపడని కారణంగా గత 2 రోజుల నుంచి మత్స్యకార మహిళలు తీరంలో ఒడ్డున బంగారు రజకు కోసం జల్లెడ పట్టారు. దువ్వెనలు, పలుచని బ్లేడ్ వంటి రేకులతో సముద్రం ఒడ్డున ఇసుకపై రాయడంతో బంగారం రజను తళతళలాడుతూ కనిపిస్తుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మత్స్యకారులు ఒడ్డునే బంగారు రజను కోసం వెతుకుతున్నారు. గత నెలరోజులుగా సముద్రంపై వేటకు వెళ్లని మత్స్యకారులకు రజను వేట కాస్త ఉపశమనం కలిగిస్తోంది.

కానిస్టేబుళ్ల ఎంపిక ఏర్పాట్ల పరిశీలన


పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్

కాకినాడ క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) ఈనెల 30 నుంచి నిర్వహించనున్న పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియకు సంబంధించి దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారం పరిశీలించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరంగా మొత్తం 381 సివిల్ కానిస్టేబుళ్ల ఎంపికకు, ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్‌లో 630 కానిస్టేబుళ్ల పోస్టుల ఎంపికకు జరుగుతున్న ఈ ప్రక్రియలో వివిధ పరీక్షలకు మొత్తంగా పురుషులు 6,333, మహిళలు 1,449మంది హాజరవుతారని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఏఆర్ అడిషినల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టుబడ్డ వ్యవహారంలో కేసు నమోదు

కాకినాడ క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులోని, లంగరురేవులోని ఓ బార్జిలో పీడీఎస్ బియ్యం పట్టుబడ్డ వ్యవహారంలో కేసు నమోదైంది. ఏపీఐవికె 0073 నెంబరు గల బార్జిలో ఇటీవల 1000 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నాయన్న పక్కా సమాచారంతో కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలతో రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులు యాంకరేజ్ పోర్టులో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 0073 బార్జిలో 1,064 టన్నులు బియ్యాన్ని ఈనెల 20న స్వాధీనం చేసుకున్నారు. రూ.4.60 కోట్ల విలువైన ఈ బియ్యం కరప మండలం, నడకుదురులో ఉన్న లవణ్ ఇంటర్నేషనల్ సార్టెక్స్ ప్లాంట్ చెందినవిగా గుర్తించారు. అనంతరం ఆ సంస్థ ఎండీ కొట్టారి అమిత్ కుమార్‌జైన్, సంస్థ సూపరివైజర్ గొడితి రవికుమార్‌పై 318 (4), బీఎన్ఎస్ 7 (1) ఈసీఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గన్ మిస్ ఫైర్

రిటైర్డ్ మిలటరీ ఉద్యోగికి గాయాలు

నిడదవోలు, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): గన్ మిస్ ఫైర్ అయినా ఘటనలో రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి స్వల్ప గాయాల పాలయ్యాడు. నిడదవోలు మండలం కాటకూటేశ్వరం గ్రామానికి చెందిన కారింకి శ్రీనివాస్ మిలట్రీలో పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన తన గన్‌ను ప్రతి 6నెలలకోసారి నిడదవోలు సీఐ కార్యాలయానికి తనిఖీ చేయిస్తుంటారు. దీనిలో భాగంగానే గురువారం నిడదవోలు పోలీస్ సర్కిల్ కార్యాలయానికి తన గన్‌ను చెక్ చేయించడానికి తీసుకువచ్చారు. స్టేషన్ బయట కూర్చుని గన్ శుభ్రం చేస్తుండగా ట్రిగ్గర్ వేలికి తగిలి మిస్ ఫైర్ అయినట్టు చెబుతున్నారు. ప్రమాదవశాత్తూ బుల్లెట్ రిలీజై ఆయన బొటన వేలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపారు. నిడదవోలు ఎస్ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పోలవరం సందర్శనకు పార్లమెంట్ కమిటీ

జనవరి 10న రాక..
11న పోలవరం పర్యటన

రాజమహేంద్రవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలవరం సందర్శనకు పార్లమెంట్ కమిటీ హాజరవుతుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్‌తో కలిసి శుక్రవారం సమీక్షించారు. జనవరి 11వ తేదీన సుమారు 30మంది ఎంపీలతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పోలవరం ప్రాజెక్టు సందర్శిస్తుందన్నారు. 10వ తేదీ రాత్రి మధురపూడి విమానాశ్రయానికి కమిటీ సభ్యులు చేరుకుని రాజమహేంద్రవరంలో బస చేస్తారు. 11న ఇక్కడ నుంచి బయలుదేరి పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తారని, ఎయిర్ పోర్టు, రాజమహేంద్రవరంలో వారు బస చేసే ప్రాంతంలోనూ కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ పర్యటన విజయవంతం కోసం లైజనింగ్ అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీల విడిది కేంద్రం వద్ద 24 గంటలూ ఉండే విధంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. 10న రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని టూరిజం, సాంస్కృతిక శాఖ అధికారులకు సూచించారు. గోదావరి హారతికి ఎంపీలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఈదరపల్లిలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

అమలాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు సాహిత్ అకాడమీ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఈదరపల్లిలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 200 మందికి పైగా చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో వంద మంది వరకు అంతర్జాతీయ రేటింగ్ కలిగిన చెస్ క్రీడాకారులు ఉండడం విశేషం. టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పప్పుల శ్రీరామచంద్రమూర్తి, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ముషిణి సత్యనారాయణ, ఎన్ఆర్ఐ గుబ్బల నాగేశ్వరరావు హాజరయ్యారు. అండర్-6, 8, 10, 12, 14, అండర్-16 బాలురు, బాలికల విభాగాల వారీగా పోటీలు నిర్వహించి మొదటి 3 స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలు జనవరి 17న పెద్దాపురంలో జరిగే నేషనల్ స్కూలు చెస్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారని రాష్ట్ర చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కౌరు జగదీష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, కోనసీమ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్, సంయుక్త కార్యదర్శి రాజీవ్ ప్రకటించారు.

పాదగయ ఆదాయం రూ.24.45 లక్షలు

పిఠాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. 72 రోజులకు రూ.24లక్షల 45వేల 110ల ఆదాయం లభించింది. 12.550గ్రాముల బంగారం, 1150 గ్రాముల వెండి వచ్చింది. దేవదాయశాఖ ఆభరణా తనిఖీ అధికారి, అసిస్టెంట్ కమిషనరు వి.వళ్లంరాజు, తనిఖీదారు వి.ఫణికుమార్, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమలాపురం

ఆలయంలో శ్రీదేవి పూజలు

అంతర్వేది, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. తొలుత ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. వేదపండితులు మహదాశీర్వాచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

కిరాణా షాపులో చోరీ

అల్లవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బెండమూర్లంక- కొమరగిరిపట్నం సెంటర్‌లో ఉన్న కేదారిశెట్టి పురుషోత్తానికి చెందిన కిరాణా షాపులో గురువారం రాత్రి దొంగలు పడి నగదు, కిరాణా సామగ్రి దోచుకుపోయారు. పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తా

- కౌన్సిల్‌లో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
- వార్షిక బడ్జెట్ రూ.25.78 కోట్లు
- రూ.44.97లక్షలతో మిగులు బడ్జెట్



నగర పంచాయతీ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. నగర పంచాయతీ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన వార్షిక బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆకస్మిక మృతికి ఎమ్మెల్యేతో పాటు కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజాప్రతినిదులు, అధికారులు పరస్పర సమన్వయంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే రూ.1.20కోట్ల నిధులు మంజూరు చేశానని, వాటితో మారుమూల ప్రాంతాల్లో వుంత రోడ్లు ఆధునికీకరణకు కేటాయించానన్నారు. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ ఐఏపీ బ్యాంకు నిదులతో చేపట్టి నిలిచిపోయిన మంచినీటి ప్రాజెక్టు పనుల పునరుద్ధరణ చేపట్టాలని, పారిశుధ్య కార్మికుల కొరత పరిష్కారానికి కృషి చేయాలని, పోలమ్మచెరువు, అయ్యవారిచెరువుల ఆధునికీకరణ, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలని, డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని, శ్మశానవాటిక ఆధునికీకరణ వంటి సమస్యలను ఎమ్మెల్యే బుచ్చిబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు రూ.88లక్షలతో ప్రతిపాదనలు సిద్ధంచేశామని, ఈనిధులు వెంటనే మంజూరు చేస్తామన్నారు. చెరవుల ఆధునికీకరణ, వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం ఓఎన్జీసీ, ఆయిలిండియా కంపెనీలతో మాట్లాడి సీఎస్సార్ నిధుల మంజూరుకు కృషి చేస్తారన్నారు. నగర పంచాయతీలో పలు సమస్యలను ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి వివరించానన్నారు. డంపింగ్ యార్డు, శ్మశానవాటిక ఆధునికీకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వార్షిక బడ్జెట్ రూ.25.78కోట్లు..

నగర పంచాయతీ 2025-26 సంవత్సరానికి అంచనా వార్షిక బడ్జెట్‌ను రూ.25.78కోట్లతో సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. గడిచిన ఏడాది బడ్జెట్‌ను సవరిస్తూ వచ్చే ఏడాదికి అంచనా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. ఈబడ్జెట్ అంశాలను సమావేశంలో ప్రవేశపెట్టగా ఆదాయ, వ్యయాలకు సంబంధించిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బడ్జెట్‌లో ప్రారంభ నిల్వకు రూ.54.67లక్షలు కలుపుకుని వివిధ ఆదాయ వనరుల నుంచి రాబడిని రూ.25.24కోట్లు చూపిస్తూ రూ.25.78కోట్లతో బడ్జెట్ రూపొందించారు. మూలధనం ఖర్చుల కింద రూ.25.34కోట్లు చూపిస్తూ అంత్య నిల్వ రూ.44.97లక్షలుగా పేర్కొన్నారు. బడ్జెట్‌లో రోడ్లు డ్రైన్లు, మంచినీరు సరఫరా వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బదులిచ్చే వారేరీ?

- మండల సమావేశానికి అధికారులు గైర్హాజరుపై సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు

ఉప్పలగుప్తం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒక సారి స్థానిక సమస్యలను ప్రస్తావించి, పరిష్కారాల కోసం ఎంతో ఆశతో సమావేశానికి వస్తున్నాం. మా సమస్యలకు సమాధానం ఇచ్చే ఒక్క అధికారి కూడా లేనప్పుడు ఇక సమావేశాలెందుకు? మా ప్రజలకు మేము ఏమి సమాధానం చెప్పుకోవాలి? అంటూ సభ్యులు ఎంపీడీవోను ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రధాన శాఖల అధికారులు రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాల తేదీలు అధికారులకు అనుకూలంగా ఉన్నాయో లేదో తెలుసుకుని సమావేశాలు ఏర్పాటు చెయ్యండి అంటూ జడ్పీటీసీ గెద్దం సంపదరావు ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సంవత్సరాల తరబడి ఇదే తంతు కొనసాగుతున్నా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు ఎందుకు వెనుకాడుతున్నారో తెలియడం లేదని అన్నారు. రైతులందరికీ యూనిక్ ఐడీ కార్డుల జారీకి రంగం సిద్ధం చేశామని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు వివరించారు. వీటి ద్వారా రైతుల పూర్తి సమాచారం డిజిటల్ ప్లాట్‌ఫారంపై ఉంటుందని అన్నారు. మండలంలో 55గోశాలల నిర్మాణం జరుగుతోందని ఉపాధి ఈసీ వీరబాబు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 12నాటికి నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. అనంతరం రెండో ఫేజ్‌లో గోశాలల నిర్మాణానికి నిధులు మంజూరవుతాయన్నారు. గొరగనమూడి డ్రెయిన్ ఆధునికీకరణ జరగపోతే దాళ్వా సాగు కష్టమని సర్పంచ్‌లు చిక్కం పెదబాబు, బద్రి బాబ్జి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు ఎప్పుడో పంపామని డ్రెయిన్స్ ఏఈ సునీత బదులిచ్చారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ పనులకు ఇంకా నిధులు మంజూరు కాలేదన్నారు. అయితే తమ సమస్యలకు బదులిచ్చే అధికారులు లేరంటూ పలువురు సభ్యులు బయటకు వెళ్లిపోయారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కి సమావేశంలో సభ్యులు, అధికారులు నివాళర్పించారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులు



అమలాపురంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్ తదితరులు



మామిడికుదురు: మగటపల్లిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నామన రాంబాబు తదితరులు

అమలాపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడై దేశాభివృద్ధిలో కీలక పాత్ర వహించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి అమలాపురం హైస్కూలు సెంటర్‌లో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధలు పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, చెల్లుబోయిన నాని, కముజు రమణ, కుడుపూడి భరత్‌భూషణ్, కుడుపూడి బాబు, పొగాకు శ్రీను పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముషిణి రామకృష్ణారావు, వంటెద్దు బాబి, నిమ్మకాయల ప్రసాద్, పేరి శర్మ, దేవరపల్లి రాజేంద్రబాబు, సుగ్గు ప్రసాద్,మొల్లేటి వెంకటేశ్వరరావు, పులుసు గంటి ప్రకాష్, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేసింది. ఆయన మృతి విచారకరమని, దేశ ప్రధానిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆర్థిక మంత్రిగా దేశాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసినివాళులర్పించారు. కార్యక్రమంలో పి.ఉదయభాస్కరవర్మ, పెన్మెత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, గోడి భాస్కరరావ పాల్గొన్నారు. మన్మోహన్‌సింగ్ ఆకస్మిక మృతికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. నగరపంచాయతీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ, నాయకులు తాడి నరసింహారావు, ములపర్తి బాలకృష్ణ, చెల్లి అశోక్, యాళ్ల ఉదయ్, దాట్ల బాబు, కౌన్సిలర్లు, టీడీపీనాయకులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి అమలాపురం మాజీ ఎంపీ అయితాబత్తుల జోగేశ్వరవెంకటబుచ్చిమహేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థిక సంస్కరణలతో భారత్‌ను పురోగామి పథంలో నిలిపిన మహోన్నత వ్యక్తిగా మన్మోహన్‌ను కీర్తించారు. అంబేడ్కర్ ఆశించిన రీతిలో బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి బాటలు వేసిన మన్మోహన్ మృతి దేశానికి తీరని లోటన్నారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశపాలనలో ముఖ్య పాత్ర పోషించారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ నుంచి ఆర్థికమంత్రి, దేశప్రధాని వరకు మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పీసీసీ సభ్యుడు ములపర్తి మోహనరావు ఇంటి వద్ద మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాచవరపు శివన్నారాయణ, ములపర్తి మోహనరావు, నెల్లి వెంకటరమణ, ఆదుర్తి నారాయణమూర్తి, మహ్మద్ ఇస్మాయిల్, ఆరీఫ్, ములపర్తి శాంతకుమారి పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కర్త మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం మగటపల్లిలో జరిగిన కార్యక్రమంలో నామన పాల్గొని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, వర్ధినేని బాబ్జి, బొంతు పెదబాబు, సూదా బాబ్జి, బోనం బాబు, నామన నాగేశ్వరరావు పాల్గొన్నారు. నగరంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు కీలకపాత్ర పోషించాయన్నారు. కార్యక్రమంలో అప్పన శ్రీరామకృష్ణ, కూనపరెడ్డి కృష్ణ, గెద్దం వెంకటేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు, వానరాశి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు తాడేపల్లిగూడెంకు చెందిన దుగ్గిన శ్రీనివాసరావు శుక్రవారం రూ.10,116లు విరాళంగా ఇచ్చారు. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన



ముమ్మిడివరం: నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మిడివరంలో నిరసన చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరాగా ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్, లంకతల్లెమ్మ గుడి, విష్ణాలయం సెంటర్, మార్కెట్ సెంటర్ మీదుగా కాశివానితూము బైపాస్ రోడ్డు వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి కొండాలమ్మ చింత నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేశారు ఏడీఈ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు పెయ్యల చిట్టిబాబు, పెన్మత్స చిట్టిరాజు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, నాయకులు పెయ్యల భూలక్ష్మి,కాశి బాలమునికుమారి, జగతా బాబ్జి, నల్లా నరసింహమూర్తి, పిన్నమరాజు వెంకటపతిరాజు, కాదా గోవిందకుమార్, ఎంపీపీలు కోలా గంగాభవానీ, కాశి మిరియంజ్యోతి, జడ్పీటీసీలు కుడుపూడి శంకరరావు, నేల కిశోర్‌కుమార్, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి నిరుపేదలను మోసం చేసిందని జడ్పీ చైర్మన్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు ఆరోపించారు. విద్యుత్ బిల్లులు పెంపుపై నిర్వహించిన పోరుబాటలో ఆయన మాట్లాడారు. పెట్రోలు బంకు నుంచి ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేసి నిర సన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీలు బూడిద వరలక్ష్మి, గన్నవరపు శ్రీనివాస్, నేలపూడి స్టాలిన్‌బాబు, నక్కా వెంకటేశ్వర రావు, విత్తనాల శేఖర్, అడ్డగళ్ల వెంకటసాయి రాం, తులా గోపాలకృష్ణ, మందపాటి కిరణ్‌కుమార్, దేశరాజు సీతారామయ్య(సాయి) పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని ఎస్సీ, ఎస్టీలకు రాయితీలు కొనసాగించాలని కోరుతూ మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏఈఈ బొలిశెట్టి ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో కూనపరెడ్డి రాంబాబు, గుబ్బల మనోహర్, గుబ్బల రోజారమణి, పాటి శివ, నల్లి శివ, కూనపరెడ్డి రాంబాబు, కటకంశెట్టి ఆదిత్య పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 108 దరఖాస్తులు

రాజోలు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): చింతలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీఎల్పీవో పి.బొజ్జిరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరు దరఖాస్తులు, రేషన్‌కార్డు కోసం 37, గృహనిర్మాణం 1, పెన్షన్లు 48, ఇంటిస్థలాలు 9, ఇతర శాఖలకు సంబంధించి 7, మొత్తం 108 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, మట్టా సురేష్, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ఎస్ రాజు, ఆర్ఐ రాంబాబు, సెక్రటరీ రజనీ, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలు బాగున్నాయి

రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి నవీన్‌కుమార్

మామిడికుదురు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పీచుతో తయారుచేసిన హస్తకళ బొమ్మలు బాగున్నాయని రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి నవీన్‌కుమార్ తెలియచేశారు. పాశర్లపూడిలోని కొబ్బరిపీచు బొమ్మల దుకాణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంత మహిళల చేతిలో రూపుదిద్దుకున్న వివిధ రకాల పీచు బొమ్మలను చూసి ఆశ్చర్యం చెందారు. వారి హస్తకళా నైపుణ్యాన్ని నవీన్‌కుమార్ అభినందించారు. ఆయనతో పాటు లీడ్‌బ్యాంక్ మేనేజర్ కేశవ్, కటికిరెడ్డి గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పార్టీ శత వార్షికోత్సవం

ముమ్మిడివరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని వందవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ముమ్మిడివరం పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం శత వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శీలం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం శత వార్షిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి రాము, కె.రామకృష్ణ, వనచర్ల విజయ్‌కుమార్, మోకా శ్రీనివాసరావు, సానబోయిన మనోహర్, దొమ్మేటి వీరంశెట్టి, పలివెల రాంబాబు, కామిశెట్టి నాగబాబు, పలివెల నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రహ్లాదబాబా జయంతి వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న గజల్ శ్రీనివాస్



ప్రహ్లాదబాబా ఆశ్రమంలో గీతాలు ఆలపిస్తున్న గజల్ శ్రీనివాస్

అల్లవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సద్గురు ప్రహ్లాదబాబా ఆధ్యాత్మికత భక్తులకు శ్రీరామ రక్షని ప్రముఖ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. కొమరగిరిపట్నంలో ఉన్న తోటల పందరి ఆశ్రమాన్ని గజల్ శ్రీనివాస్ సందర్శించారు. శుక్రవారం సద్గురు శ్రీప్రహ్లాదబాబా 105వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రణవ పతాకావిష్కరణ, గ్రామోత్సవం, అఖండ నామసంకీర్తన, దీపోత్సవాలకు భక్తులు పోటెత్తారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ గానలహరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అక్కిరాజు శ్రీనివాస్ సాయిగేయాలాపన ఆకట్టుకుంది. బాబావారి సమాధిని, సత్తెమ్మతల్లి ఆలయాన్ని భక్తులు సందర్శించారు. ఆశ్రమ నిర్వాహకులు పాతూరి రాంజీ, డాక్టర్ ఏ.ప్రభాకర్, లక్ష్మణరావు, పిండి వెంకటేశ్వరరావు, రుద్రరాజు సూర్యనారాయణరాజు, పోచనపెద్ది వెంకటేష్, పిండి దొరబాబు, యాళ్ల వెంకటానందంతో పాటు ఉభయరాష్ట్రాల నుంచి వచ్చిన అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన



బండారులంకలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

అమలాపురం రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బండారులంక మాడావారి వీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేక శిబిరాన్ని రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది సభ్యత్వ నమోదు కోసం శిబిరం వద్దకు వచ్చారు. గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభించింది. నాయకులు మాడా మాధవి, అల్లక నూకరాజు, మాడా పద్మదుర్గాప్రసాద్, మావూరి శివ, కాశిన బాబి, కొండా సత్యనారాయణరాజు, విజయ్ పాల్గొన్నారు.

ఎస్సీ కుల గణనపై 31వరకు అభ్యంతరాల స్వీకరణ

అమలాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీల జనాభావారీగా వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వద్దనున్న కులగణన వివరాలు అనుసరించి ఈనెల26 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలను ప్రదర్శించామన్నారు. ఈనెల 31వరకు ఎవరికైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తామన్నారు. జనవరి 6వరకు అందించిన అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతామన్నారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కులగణన, తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు మార్గదర్శకాలను జారీచేసిందన్నారు. సచివాలయాల్లో వ్యక్తుల పేర్లు, ఆధార్‌నంబరు, పుట్టినతేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాలను ఆయా జాబితాల్లో ప్రదర్శించామన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లో సంబంధిత జాబితాలు ఉన్నాయని, వీటిపై అంభ్యంతరాలుంటే సంబంధిత వీఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యంతరాలపై మూడు దశల్లో తనిఖీలు చేస్తామన్నారు. వీఆర్వో ఆర్ఐ, తహశీల్దార్ల నివేదికలను పరిశీలించిన తర్వాత ఆయా వివరాలను పోర్టల్‌లో పొందుపరుస్తామన్నారు.

దాట్లకు భారతి స్మారక పురస్కారం



యానాం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తటవర్తి భారతి స్మారక పురస్కారానికి యానానికి చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు ఎంపికయ్యారు. ఈనెల 29న విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జరిగే పురస్కార సభలో పురస్కారం అందుకుంటారు. తెలుగు భాష అభివృద్ధికి కృషిచేస్తున్న సాహితీవేత్తలను నగదు, జ్ఞాపిక, శాలువాతో అమెరికా నివాసి తెలుగు భాషాభిమాని, రచయిత తటవర్తి త్రినాథ నాగేశ్వరరావు సత్కరిస్తున్నారు. కలైమామణి, తెలుగురత్న, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాలను ఇప్పటికే దాట్ల అందుకున్నారు. ఇప్పటివరకు ఆరు కథాసంపుటులు, ఏడు కవితాసంపుటులు, చరిత్రగంధం, రాజకీయ వ్యంగం కథనాలు దాట్ల వెలువరించారు.

వీఆర్వోలను ఇబ్బందులకు గురిచేయడం తగదు

అమలాపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తీవ్ర పని ఒత్తిడితో రెవెన్యూ విధుల నిర్వహణలో ఉన్న వీఆర్వోలను ఇబ్బందులకు గురిచేయడం తగదని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు పేర్కొన్నారు. అమలాపురం గ్రామకచేరీ చావిడి వద్ద కొప్పిశెట్టి వెంకటగణేష్ అధ్యక్షతన శుక్రవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. సమయంతో నిమిత్తం లేకుండా పనిచేసే వీఆర్వోలకు కొందరు సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలకు మెమోలు ఇవ్వడం, జీతాలు నిలుపుదల చేయడం వంటి పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో ఎక్కువ శాతం ప్రజలకు రెవెన్యూ అంశాలపైనే పని ఉంటుందని, అందుకు అనుగుణంగా వీఆర్వోలకు సహకరించాలని కోరారు. వీఆర్వోలకు గ్రేడ్-1, -2లకు కామన్ డీడీవోగా తహశీల్దార్ ఉండాలని, సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ కల్పించాలని, జీవో 164 అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు మాచిరాజు వాసు, ఏవీఎస్ఎన్ రాజు, అంకన రాజేష్, శ్రీనివాస్, జయరాజు, వీరబాబు, శివ, పల్లి రాంబాబు, వినోద్, సత్యవతిపాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అంతర్వేది, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి లూథరన్ హైస్కూలులో 2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం ఘనంగా జరిగింది. సఖినేటిపల్లి వేదికగా విద్యార్థులంతా కలుసుకుని అనుభూతులను పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, హెచ్ఎం గెద్దం రమేష్‌బాబు, దొండపాటి సువర్ణరత్నం, పాస్టర్ పీటర్, విజయరత్నంమార్టిన్, జాన్‌మోజెష్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం

అంతర్వేది, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం బహుళ ద్వాదశిని పురస్కరించుకుని ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద స్వామి-అమ్మవార్ల శాంతి కల్యాణం నిర్వహించారు. అర్చకులు తొలుత సింహాసనంపై స్వామి-అమ్మవార్లను ఆశీనులుచేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. శాంతి కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి-అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సుదర్శన్‌బాబు వర్ధంతి

ఐ.పోలవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దివంగత వైసీపీ నాయకుడు ఐ.పోలవరానికి చెందిన భూపతిరాజు సుదర్శన్‌బాబు 5వ వర్ధంతిని శుక్రవారం జరుపుకున్నారు. వైసీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పాతయింజరం, ఐ.పోలవరం గ్రామాల్లో సుదర్శనబాబు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. పిన్నమరాజు శ్రీను, ఎంపీపీ మిరియం రాణీజ్యోతి, కాలే రాజబాబు, ఏలూరి ఆదినారాయణ, కాటం సత్తిరాజు, మోర్త రాఘవులు, నడింపల్లి గణపతి, మూర్తివర్మ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ముమ్మిడివరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం తహశీల్దార్ ఎంవీఎస్ సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో మాట్లాడారు. భూ కొలతల్లో తేడాలు, సరిహద్దు సమస్యలు తదితర సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవాలన్నారు. రైతుల నుంచి 123వినతులు స్వీకరించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చెల్లి అశోక్, తాడి నరసింహారావు, యాళ్ల ఉదయ్, సత్తి నూకరాజు, దాట్ల బాబు, చింతలపూడి కొండబాబు మండల ప్రత్యేకాధికారి ఎస్.మురళీకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ బి.గోపాలకృష్ణ, మండల సర్వేయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ

ముమ్మిడివరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో వివిధ రకా సేవలు అందించే ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, గీజర్, టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్ రిపేర్లు, బ్యూటీషియన్లు, వాటర్ ప్యూరిఫైర్ సేవలు అందించే వారికి నైపుణ్యాభివృద్ధి ద్వారా శిక్షణ ఇస్తామని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫార్ ద్వారా వీరిని ఆన్‌బోర్డు చేయడం ద్వారా జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఈనెల28 నుంచి 31వరకు నగర పంచాయతీలో మెప్మా విభాగంలో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. రేషన్, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, పాన్‌కార్డు జిరాక్సు జతపరిచాలన్నారు. వివరాలకు 7901610085, 7901610069 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత ఫిజియోథెరపి శిబిరం

పి.గన్నవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో ఉద్యోగస్తులకు ఉచిత ఫిజియోథెరపి వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాదు నిమ్స్ నుంచి వచ్చిన వచ్చిన ఫిజియోథెరపి వైద్యులు రమేష్, సంతోష్‌లు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ వైఖరి మార్చుకోవాలి

కాట్రేనికోన, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కందికుప్ప హైస్కూల్లో 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలని ఎస్ఎంసీ చైర్మన్ మట్టా శ్రీనివాస్ చేస్తున్న ప్రయత్నం సరైంది కాదని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై చైర్మన్ వైఖరి మార్చుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇప్పుడు జీతం పెరిగిన కారణంగా వేరే వారిని నియమించుకునే కుట్ర జరుగుతోందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, విత్తనాల రాంబాబు, బొంతు పార్వతి, వజ్రపు మల్లేశ్వరి, గుత్తుల కనకదుర్గ, లక్ష్మీపార్వతి, నాగరత్నం, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పవన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

అల్లవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ ఆశయాలను జనసైనికులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. కొమరగిరిపట్నంలో పలచోళ్ల వేణు అధ్యక్షతన జనసేన సమావేశం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఆకుల నాగశ్రీను, ఉపాధ్యక్షులుగా కొండేపూడి రవి, పితాని జీవన్, ప్రధాన కార్యదర్శి అప్పన వెంకటేశ్వరరావు, కార్యదర్శులు సుంకర మాచరి, కొప్పిశెట్టి రాపులను ఎన్నుకున్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించాలి

రాజోలు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించాలని ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనవరి 2నుంచి రాజోలు వేదికగా నిర్వహించే మండల స్థాయి సైన్స్‌ఫైర్‌కు 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులను ప్రోత్సహించాలని ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో చిన్న వయసు నుంచే సృజనాత్మకతను, అన్వేషణ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. ఈసైన్స్‌ఫైర్‌లో వ్యక్తిగత, సామూహిక, శాస్త్రీయ నమూనాలను ప్రదర్శించవచ్చన్నారు. ఈనమూనాలు ఖచ్చితంగా వర్కింగ్ మోడల్స్ అయి ఉండాలన్నారు. మండలస్థాయిలో ఎంపికైన విజేతలు జిల్లాస్థాయి సైన్స్‌ఫైర్‌కు ఎంపికవుతారని ఆయన పేర్కొన్నారు.

కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

రాజోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి ప్రతిభ కలిగి ఆర్థికంగా వెనుకబడిన కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించాలని నిర్ణయించామని ది రాజోలు తాలూకా తెలగ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిండి సత్యనాగవరప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా శివకోడులో శ్రీమంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో ది రాజోలు తెలగ ఉద్యోగుల సమావేశం శుక్రవారం జరిగింది. జనవరి 19న శివకోడు శ్రీమంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో స్కాలర్‌షిప్స్ పంపిణీ చేస్తామని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి పీజీ వరకు చదువుతోన్న విద్యార్థులు 80శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు పొందినవారు అర్హులన్నారు. అర్హత గల విద్యార్థులు పూర్వపు రాజోలు తాలూకాలోని నాలుగు మండలాల కార్యవర్గ సభ్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్ బాలనాగేశ్వరరావు, మేడిచర్ల శ్రీనివాసరావు, అడబాలసుబ్బారావు, ఏపుగంటి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

కుమారుల గృహాలు పోతున్నాయనే బెంగతో వ్యక్తి మృతి



మలికిపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మేడిచర్లపాలేనికి చెందిన చింతా సుందరయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ మంచి గృహాలు నిర్మించుకున్నారు. వీరి గృహాలు రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌లో పోతున్నాయి. ఆ బెంగతో కొంత కాలంగా సుందరయ్య దిగులుగా ఉండేవాడని, ఆ బెంగతో శుక్రవారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సుందరయ్య కుమారులు ప్రస్తుతం గల్ఫ్‌లో ఉంటున్నారు. రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ అధికారులు వచ్చినప్పుడు అందరితో కలిసి సుందరయ్య కూడా అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందజేసినట్టు స్థానికులు తెలిపారు.

టిడ్కో గృహాల వేలం నిలుపుదల చేయాలి

అమలాపురం టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించలేదన్న కారణంతో టిడ్కో గృహాలకు వేలం వేయనున్నట్టు బ్యాంకు అధికారులు నోటీసులు ఇచ్చినందున వాటిని నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ లబ్ధిదారులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, టిడ్కో ఇన్‌చార్జి డి.లలితకుమారిలతో పాటు కౌన్సిలర్లకు వినతిపత్రాలు అందజేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే రుణ గ్రహీతలకు 60రోజులు గడువు ఇచ్చిందని అర్జీలో పేర్కొన్నారు. వేలం నిలుపుదల చేయాలని లబ్ధిదారులు ఉప్పాడ నూకరత్నం, రంకిరెడ్డి లక్ష్మి, నల్లా రామలక్ష్మి, నల్లా వెంకటలక్ష్మి, సత్యవాడ అరుణ, మాచర్ల వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల సందడి



వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి, అమ్మవారి గ్రామోత్సవం దృశ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందె తో తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం చేశారు. అనంత రం తిరుప్పావై వేద పారాయణం నిర్వహించారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

గోదాదేవి గ్రామోత్సవం

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం రెండో శుక్రవారం గోదా అండాళ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో గోదాదేవి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,84,623 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

వామనావతారంలో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



వామనావతారంలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

రాయవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 45వ దశావతార మహోత్సవాలు పురస్కరించుకుని రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వామనావతారంలో అలంకరించబడి శుక్రవారం పూజలందుకున్నారు. తొలుతగా స్వామివారికి వివిధ రకాల, పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర, సహస్రనామాలతో అర్చనలు, మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు, భక్త సంఘం సభ్యులు పాల్గొన్నారు.



విజయదుర్గా పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందుతున్న హెచ్చార్సీ చైర్మన్ సీతారామమూర్తి

విజయదుర్గా పీఠంలో హెచ్చార్సీ చైర్మన్ పూజలు

వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం రాష్ట్ర మానవహక్కుల కమిషన్(ఏపీ హెచ్చార్సీ) చైర్మన్, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఎం. సీతారామమూర్తి పూజలు నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని దర్శించుకుని పూజలు, హారతులు నిర్వహించిన అనంతరం పీఠాధిపతి గాడ్ స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం పీఠంలో జరిగిన పవిత్రోత్సవాలను ఆయన తిలకించారు. విజయదుర్గా అమ్మవారిని రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఏవీ సుబ్బారావు దర్శించుకున్నారు.

దుర్గమ్మకి, వేంకటేశ్వరస్వామికి తిరుమంజనం

వెదురుపాక విజయదుర్గా పీఠంలో పవిత్రోత్సవాలు పురస్కరించుకుని రెండోరోజు మంగళవారం విజయదుర్గా అమ్మవారికి, శ్రీదేవి, భూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామికి తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో విజయదుర్గాదేవికి, వేంకటేశ్వరస్వామికి అమ్మవార్లకు వివిధ రకాల ద్రవ్యాలతో తిరుమంజనం, హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. ఈకార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షతులసి పూజ

ఆలమూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆలమూరు నవజనార్ధనస్వామి ఆలయంలో శుక్రవారం లక్షతులసిపూజ ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రతీఏడాది ధనుర్మాసంలో నిర్వహించే లక్షతులసి పూజ కార్యక్రమం ఆలయ అర్చకులు అంగర రంగాచార్యులు, అంగర భగవాన్‌ల ఆధ్వర్యంలో పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు.

నైపుణ్య అభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రపురం(ద్రాక్షారామ)డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి):పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, పురపాలక సంఘం పరిధిలో ప్లంబర్లు, కార్పొరేటర్లు, ఎలక్ట్రిషియన్లు, ఏసీ రిపేరు, గీజరు రిపేరు, రిఫ్రిజిరేటర్ రిపేరు, వాషింగ్ మిషన్ రిపేరు, బ్యూటీషియన్, పెయింటర్ వంటి సేవలు అందించేవారికి నైపుణ్య అభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాయుడు తెలిపారు. ఎన్ఎస్‌డీసీ ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ప్లాట్‌ఫారం ద్వారా జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలవారు ఈనెల 30 వరకు మెప్మాకార్యాలయం, రామచంద్రపురంలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. రేషన్‌కార్డు, ఆధార్ జెరాక్స్, బ్యాంకు పాసుపుస్తకం, పాన్‌కార్డు జెరాక్స్‌తో సంప్రదించాలని కోరారు.

ఏడిద కొత్తూరులో ఆక్రమణల తొలగింపు



ఏడిద కొత్తురులో ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ, పోలీసు సిబ్బంది

మండపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడిదకొత్తూరులో పంటపొలాలు రోడ్డును ఆక్రమించుకుని ఉం టున్న 8మంది పాకలను శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య పంచాయతీ అధికారులు తొలగించారు. గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు తమ పంట పొలాల పక్కన ఆక్రమించి 8మంది పశువుల పాకలు, గడ్డిమేట్లను వేశారని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించటంతో వాటిని తొలగించాలంటూ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 40 మంది పోలీసు బందోబస్తుతో ఆక్రమణలను తొలగించారు. మండల ఈవోపీ ఆర్డీ దాసరి శ్రీనివాసరావు, ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరా వులతో పాటు 12 పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు

ఆలమూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ అన్నారు. ఆలమూరు మండలం పినపళ్లలో సాగునీటి కాలువను ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న రైతులతో చర్చించారు. దాళ్వాలో సాగునీటి ఇబ్బందులపై రైతులు వివరించారు. సాగునీరు సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలువలలో ఉన్న తూటుకాడను తొలగించి దిగువ ప్రాంతాలకు సక్రమంగా సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గారపాటి శ్రీనివాస్ ఇరిగేషన్ సిబ్బందికి సూచించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ పోరుబాట

● మెయిన్‌రోడ్డులో ప్రదర్శన

రామచంద్రపురం(ద్రాక్షారామం),డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణంలో శుక్రవారం వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి సూర్యప్రకాష్, నాయకులు, కార్యకర్తలు మెయిన్‌రోడ్డులో ప్రదర్శన జరిపారు. పురపాలక సంఘ కార్యాలయంవద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో విద్యుత్ చార్జీలు పెంపుదలను ఉపసంహరించుకోవాలని డిమాండ్లతో డీఈఈ రత్నాలరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీలు అంబటి భవానీ, పంపన నాగమణి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ పండు గోవిందరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో డీఈఈ రత్నాలరావుకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ బోస్, మండపేటలో విద్యుత్‌శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కూటమిపాలనలో ప్రజలపై పన్నుల వడ్డన

మండపేట: రాష్ట్రంలో ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలు పేరిట ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలుచేయటంలో ఘోరంగా విఫలమైందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. విద్యుత్‌చార్జీలు వడ్డనను నిరసిస్తూ పార్టీ హైకమాండ్ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం తోట సారథ్యంలో వైసీపీ శ్రేణులు ప్రభుత్వం తీరును నిరసిస్తూ స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి మెయిన్ రోడ్డు కేపీ రోడ్డు, మీదుగా మారేడుబాక విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్దకు చేరుకుని స్టేషన్‌ను ముట్టడించారు. అనంతరం ఆయన పార్టీశ్రేణులతో కలిసి విద్యుత్‌శాఖ అధికారికి వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, ఎంపీపీలు ఉండమట్ల వాసు, నౌడు వెంకటరమణ, మేడిశెట్టి దుర్గ, మాజీ ఎంపీపీ సిరిపురపు శ్రీనువాస్, వైసీపీ నేతలు రెడ్డి రాధాకృష్ణ, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీనాయకులు పాల్గొన్నారు.



రావులపాలెంలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన ర్యాలీ

రావులపాలెం: కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విద్యుత్ ఛార్జీలపై నిరసన ర్యాలీ చేపట్టారు. వైసీపీ పార్టీ ఈ సందర్భంగా రావులపాలెంలోని జాతీయ రహదారి చెంతనే ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చిర్ల సోమసుందరరెడ్డి, కళా వెంకట్రావు విగ్రహాలకు పూలమాలలువేసి స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి నిరసన రాలీని ప్రారంభించారు. అనంతరం కొత్తపేట ఏడీఏ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లారు.

కొత్తపేట: వైసీపీ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై శుక్రవారం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఎలక్ట్రికల్ ఏడీఏకు వినతిపత్రాన్ని అందించారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. గొల్లపల్లి డేవిడ్‌రాజు, జడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీపీ మార్గాన గంగాధర్, సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, కుడుపూడి శ్రీను, తమ్మన శ్రీనివాస్, ముత్యాల వీరభద్రరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమీప పాఠశాల నుంచి సబ్జెక్ట్ టీచర్లను సర్దుబాటు చేస్తాం

● డీఈవో సలీంబాషా



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించేందుకు సమీప పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులను సర్దుబాటుచేస్తామని డీఈవో ఎస్.కె.సలీంబాషా అన్నారు. శుక్రవారం రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు జాతీయోన్నత పాఠశాలలో రామచంద్రపురం డివిజన్‌లో రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాల ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు కేవలం 60రోజులు మాత్రమే ఉన్నందున విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న పాఠశాలలకు అదనంగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. విద్యార్థులు పదవతరగతిలో మంచి ఫలితాలు సాధించడానికి అన్నిచర్యలు తీసుకుంటామని అన్నారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలకోసం ప్రత్యేక చర్యలు

మండపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని జిల్లా విద్యాధికారి షేక్ సలీం బాషా చెప్పారు. మండలంలోని ద్వారపూడి జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్‌ను డీఈవో శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన విద్యార్దులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో పదోతరగతి విద్యార్థులు 19000 మంది ఉన్నారని వారిలో 6000 మంది ప్రైవేటు విద్యార్థులు మిగిలిన 13000మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులని ఆయన తెలిపారు. ద్వారపూడి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

● మంత్రి వాసంశెట్టి సుభాష్



మండపేటలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొత్తపేట కళాశాలలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి):మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. డా.మన్మోహన్‌సింగ్ మృతిపట్ల మంత్రి సుభాష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆర్బీఐ గవర్నరుగా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఆయన ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడారు. 1991లో మన్మోహన్ సింగ్ తెచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చాయని అన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంతాపం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ కోటశ్రీనివాసరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్డిఖాన్, మెహతాబ్ ఖరేషి, శృంగవరపు స్వామి, వాసంశెట్టి గణపతి, పావులూరి సాయిసుధీర్, పల్లపల్లి సురేష్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపేట: భారత ఆర్థిక సంస్కరణల రూపకర్త, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి తీరనిలోటని, ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్తపేటలో టీడీపీ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.రమాదేవి, ఎస్.భ్రమరాంబ, అధ్యాపకులు, టీడీపీ నాయకులు ముత్యాల బాబ్జి, బూసి భాస్కరరావు, పల్లికొండ సుధీర్, బూసి విష్ణు, చోడపనీడి భాస్కరరావు, నిమ్మకాయల చిన్నయ్య, యేలిశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

మండపేట: ప్రధానిగా పనిచేసి దేశ ఆర్థికవ్యవస్థను చక్కదిద్దిన అర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని పలువురు రాజనీయ నాయకులు తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. మాజీ ప్రధాని మృతిపట్ల ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, మండపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ కామన ప్రభాకరరావు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ సాయి, పలువురు నేతలు సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు కామన ప్రభాకరరావు నేతృత్వంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: ఆర్డీవో



ఆలమూరు: పినికేరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన అన్నిరకాల సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కారం అవుతాయని ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. ఆలమూరు మండలం పెనికేరులో తహశీల్దార్ కెజె. ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో శ్రీకర్ పాల్గొన్నారు. పంటకాలువలలో మురుగునీరు వదిలేయడంవల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అందువలన పంటకాలువలలో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు ఆర్డీవో శ్రీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆయన స్వయంగా రైతులవద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, సర్వేయర్ ప్రభావతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం ఆందోళన

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. భీమక్రోసుపాలెం రామాలయంవద్ద నుంచి ప్రదర్శనగా రైతుకూలీ సంఘం నాయకులు, మహిళలు రెవెన్యూ సదస్సు వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. భీమక్రోసుపాలెంలో ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న సీలింగ్ భూమిని పేదలకు పంపిణీ చేయాలని, పేదలు సాగుచేసుకుంటున్న పోరంబోకు భూములను సర్వే చేసి పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని, శ్మశానవాటికకు మార్గం ఏర్పాటుచేసి రోడ్డు నిర్మించాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహశీల్దార్ ఎం.సావిత్రికి అందచేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, గ్రామకమిటీ నాయకులు గుండుపల్లి మంగమ్మ, విప్పర్తి సుబ్బలక్ష్మీ, పోతురాజు సీత, సాధనాల బిల్లమ్మ, కొండేపూడి వీరాస్వామి, సుందరపల్లి బేబి పాల్గొన్నారు.

కె.గంగవరం: రీసర్వే వలన కలిగిన భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు అన్నారు. శుక్రవారం కోట గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ భూముల సమస్యలు పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్.ఐ వెంకట్రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని వసంతవాడలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దారు రాజేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్ నరేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. రెవెన్యూ పరమైన, భూసమస్యలపై 15 అర్జీలను రైతులు అందించారు. గ్రామంలో ఆయన ర్యాలీ నిర్వహించి రెవెన్యూ సదస్సుపై అవగాహన కల్పించారు.

కపిలేశ్వరపురం: రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను పటిష్టాత్మకంగా చేపట్టిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి. చిన్నారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పడమరఖండ్రిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామరెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ భూసమస్యల పరిష్కారం కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జమ్మ, వీఆర్వోలు, గ్రామసర్వేయర్లు, గ్రామపెద్దలు, రైతులు, రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం

రావులపాలెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, పట్టుదల, ఆశయం ఉండే విధంగా పెంచాలని, దేశభవిష్యత్‌కు ఆదర్శ వ్యక్తులుగా పిల్లలను తయారు చేయడంలో అధ్యాపకులు తల్లిదండ్రులు కృషి ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్.అరుణ్‌కుమార్, రమేష్‌బాబు, రజని, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

కపిలేశ్వరపురం, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగర పీహెచ్‌సీలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు వినియోగించి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. రత్నకుమారి, కమిటీ సభ్యులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈవో జె. మల్లిఖార్జునుడు, గ్రామనాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే వేగుళ్ల



మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. పట్టణ మెప్మా విభాగంలో శుక్రవారం స్థానిక డొక్కా సీతమ్మ మహిళా సాధికారిక భవనంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం 98 మహిళా సంఘాలకు మంజూరు చేసిన రివాల్వింగ్ ఫండ్ రూ.9.8లక్షలు చెక్కును ఆయన మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఆర్‌పీలు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, మెప్మా అధికారిణి సూజాత పాల్గొన్నారు.

ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌కు సత్కారం

ఆత్రేయపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్‌గా కరుటూరి నరసింహరావు ఎన్నిక కావడంతో ఘనంగా సత్కరించారు. శుక్రవారం అంకంపాలెంలో ఆయనను దేవస్థానానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కరుటూరిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గ్రామస్థులు పార్టీ శ్రేణులు నరసింహారావును సత్కరించి రైతు సంక్షేమానికి పాటుపడాలని కోరారు.



అంకంపాలెంలో ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ కరుటూరి నరసింహారావును సత్కరిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

రావులపాలెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం కోస్టల్ బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. బ్యాంకు రజితోత్సవ వేడుకలను పురస్కరించుకుని మేనేజర్ సీహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో డాక్టర్ కర్రి బలరామ్‌రెడ్డి, డాక్టర్ కర్రి సందీప్‌రెడ్డిలు పాల్గొని వైద్య సేవలు అందించారు. అనంతరం మేనేజర్ ఖాతాదారులకు డిపాజిట్ పథ కాలపై వివరించారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్

రామచంద్రపురం(ద్రాక్షారామ)డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):ఎస్సీకులగణనపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనరు నాయుడు తెలిపారు. ఎస్సీ కులగణన వివరాలు గురువారంనుండి గ్రామ,వార్డు సచివాలయాల వద్దప్రదర్శనకుఉంచామన్నారు. 31 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. జనవరి 10న కులగణన తుది వివరాలు ప్రకటిస్తారన్నారు.

రామచంద్రపురం ఎస్ఐగా నాగేశ్వరరావు



రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం ఎస్ఐగా ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న నాగేశ్వరరావును రామచంద్రపురం ఎస్ఐగా నియమించారు. కాట్రేనికోన ఎస్ఐగా పనిచేసిన ఆయనను వీఆర్‌లో ఉంచారు. వీఆర్ నుంచి రామచంద్రపురం ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు.



వెదురుమూడిలో చేపడుతున్న రహదారి పనులు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కపిలేశ్వరపురం, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి) : రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ శాఖ జేఈ డీవీ రాఘవులు అన్నారు. శుక్రవారం మండలంలోని వెదురుమూడిలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25లక్షలతో ప్రారంభమైన 5 సీసీరోడ్లు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ సిబ్బంది, గ్రామప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



గంగవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చిర్రా రాజ్‌కుమార్

కె.గంగవరం, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కె.గంగవరంలో రూ.4,50,000లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్ భూమి పూజ చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తాడాల ఈశ్వరరావు ఇంటి వద్ద నుంచి రిలయన్స్ టవర్ వరకూ 100 మీటర్లు వరకూ నిర్మించనున్నట్లు రాజ్‌కుమార్ చెప్పారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం

ద్రాక్షారామ-కోటిపల్లి రహదారిలో కె.గంగవరంలోని రైస్‌మిల్లు ఆవరణలో రహదారిలో గుంతలు పూడ్చే పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభించారు. ఈ రహదారిలో సుమారు 400 మీట ర్లు రోడ్డు పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. దీంతో పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ గుంతలు పూడ్చే కార్యక్రమానికి మండలంలో ఈ రహ దారిలో భూమిపూజ చేశారు. నేటివరకూ పనులు ప్రారంభం కాలేదు. ఈలోగా ప్ర యాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో రహదారిలో గుంతలు పూడ్చేపనులు చేపట్టారు.

తోటపేట సర్పంచ్ కామరాజు మృతి



ద్రాక్షారామ, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం తోటపేట సర్పంచ్ కోరపు కామరాజు (59) శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కామరాజు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కొత్తపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కండ్రిగలో నిర్వహించిన దాడులలో గుత్తుల వెంకట్రావును 6 మద్యం బాటిల్స్‌తో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు.

ప్రజల కోసం నిర్మించిన పార్క్‌ను ధ్వంసం చేయడం దారుణం

రావులపాలెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆహ్లాదంగా సేదతీరేందుకు నిర్మించిన పార్క్‌ను ధ్వంసం చేయడం దారుణమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ అన్నారు. రావులపాలెం మండలం కొమరాజులంకలో కూటమి కార్యకర్తలు ధ్వంసం చేసిన పార్క్‌ను శిలాఫలకాలను మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల కోసం నిర్మించిన పార్క్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిలాఫలకాలు, పార్క్‌లు ధ్వంసం చేసే సంస్కృతిని తీసుకురాకుడదన్నారు. అభివృద్ధికి సహకరించి దానిని ముందుకు తీసుకునివెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, విద్యపై అవగాహన

మండపేట, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి పిల్లలు పెంపకం ఆరోగ్యంపై అవగాహన కల్పించటంతోపాటు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికలకు లైంగిక వేధింపులపై అవగాహన కల్పించేందుకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన మండపేట ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి, ఎంపీడీవో సత్యన్నారాయణ హాజరయ్యారు. కార్యక్రమం లో కిషోర్‌బాలిక శిక్షణ వివిధ అంశాల గురించి వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ద్రాక్షారామ,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామానికి చెందిన తెలగాని ఆదిలక్ష్మీ(68) చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలగాని ఆదిలక్ష్మీ కడుపునొప్పి, కీళ్లవాతం వ్యాధులతో బాధపడుతూ ఈనెల 24న రాత్రి చెదలమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. భర్త సత్యనారాయణ ఫిర్యాదుమేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.